సుబోధని గ్రంథమాల :—నెం. 9

శ్రీ

గోపాలకృష్ణగోఖలే

గ్రంథకర్త

మన్నేపల్లి - రామకృష్ణరావు

ద్వితీయముద్రణము

1000 ప్రతులు

నెల్లూరు

1918

అంకితము

భారతపుత్రావతంసమగు

గోపాలకృష్ణ గోఖలేగారి

ప్రియంబైన స్మృతికి.

సంపాదకీయ విజ్ఞప్తి

ద్వితీయ ముద్రణము

ప్రథమముద్రణమునం గల లోపముల నన్నిటిని సాధ్యమైనంతవఱకు సవరించి దీనిం బ్రచురించితిమి. ఈ చిన్ని పొత్తము చక్కఁగ రచియింపఁబడినదని ప్రశంసించుచు తమ యభిప్రాయములఁ దెలిపిన మహాజనుల కందఱికిని వందనము లర్పించుచున్నారము. ఈ వఱకు ఈ గ్రంథప్రతులు సుమారు 200 గ్రంథాలయముల కుచితముగ నొసంగితిమి. కాగితపుఁ గఱవుచే ముద్రణాది వ్యయములు హెచ్చిన యీ తరుణమునం దట్టి సహాయమింకను చేయఁజాలక పోవుటకు చింతిల్లుచున్నాము. ప్రథమముద్రణ ప్రతులవలెనే ఈ ముద్రణప్రతులను ఆంధ్ర మహాశయు లాదరింతురు గాక యని వారల ప్రార్థించుచున్నాము.

నెల్లూరు
9-2-18

మ. రామకృష్ణరావు

ప్రథమ ముద్రణము

కీర్తిశేషులగు శ్రీయుత గోపాలకృష్ణ గోఖలేగారి జీవిత చరిత్రమును రచియించి ప్రచురింప వలెనను నుత్సాహము

కలిగి, ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, న్యూఇండియా మున్నగు ఆంధ్రాంగ్లేయ పత్రికలను, కొన్ని గ్రంథములను సహాయముగాఁ గొని, చిన్న వ్యాసమును వ్రాసి ప్రచురింపఁ గలిగితిమి. కొన్ని కారణములవలన నీవ్యాస మతిస్వల్పకాలములో వ్రాయవలసినటులు తటస్థించెను. కాన మేమనుకొనినంత వివరముగ నీపొత్తమును రచియించుట కవకాశము లేక పోయెనని చింతిల్లుచున్నాము. చదువరు లీవ్యాస మందలి లోపముల విడిచి గుణమును గ్రహించి, గోఖలేగారి జీవితములోని విషయములనే ముఖ్యముగ గమనింప వలయునని మా ప్రార్థన.

ఇందు చివర భాగమున ననుబంధముగా 'ప్రశంసా సూక్తి ముక్తావళి'యను శీర్షక క్రింద లోకమాన్యుల విషాద సూచికాభిప్రాయములను, మరికొన్ని యాంధ్రాంగ్లేయ పత్రికల యభిప్రాయములను, ఆంధ్రకవుల పద్యములను, ముద్రించితిమి. తత్పత్త్రికాధి పతులకును, కవివర్యులకును, కృతజ్ఞతా పూర్వక వందనముల సర్పించుచున్నాము.

ఈ గ్రంథ ముద్రణమునకు వలయు ద్రవ్యసాహాయ్యమొసఁగి, ద్రవ్య లోపముచే నిడుమల నొందుచున్న మా గ్రంథమాలకుఁ గొంతజీవము నొసంగిన శ్రీయుత వేటూరు కోదండరామ రెడ్డిగారికి మే మేంతయుఁ గృతజ్ఞులము.

నెల్లూరు
12-8-15

మ. రామకృష్ణరావు

శ్రీ

గోపాలకృష్ణ గోఖలే

మొదటి తరంగము

ప్రారంభము

హిందూ దేశములోఁ బశ్చిమ భాగమున బొంబాయి రాజధానికిఁ జేరి సుప్రసిద్ధచరిత్ర గల మహారాష్ట్ర దేశ మొండు గలదు. ఈ మహారాష్ట్రదేశము ప్రాచీన కాలమునుండి భరతఖండమునకు వన్నెఁ దెచ్చిన రాజశేఖరులకును, అమాత్యపుంగవులకును, యుద్ధవీరులకును, కవిశిఖామణులకును, తత్త్వజ్ఞులకును, భక్తాగ్రేసరులకును, జన్మస్థానమై వెలయుచున్నది. ఇదియే, స్వార్థత్యాగ వ్రత పరాయణులును, నిష్కల్మష చరితులును, కుశాగ్ర బుద్ధులును, దేశహితైక చిత్తులునగు, మహాదేవ గోవిందరాణడే, కాశీనాథ త్ర్యంబక తిలాంగ్, రామకృష్ణగోపాల భండార్కర్, విశ్వనాథ నారాయణ మాండలీకుఁడు, విష్ణు కృష్ణ చిపలుంకరు, బాల గంగాధరతిలక్, ప్రొఫెసర్ కార్వే, ఆర్. పి. పరంజపాయ్, మున్నగు మహాపురుషుల జన్మభూమి. ఇచ్చటనే మహారాజ్ఞి అహల్యాబాయి మున్నగు వీరమాతలును, పం

డిత రామాబాయి సరస్వతి మున్నగు దేశాభిమానినులును, పతివ్రతా తిలకములును, తమ కీర్తిచంద్రికలను వెదఁజల్లి హిందూ స్త్రీజన సంఘమునకు, ఖ్యాతి నొనగూర్చినది. అట్టి మహనీయుల యొక్కయు మహనీయల యొక్కయు పాదస్పర్శచేఁ బుణ్యక్షేత్రముగ నెన్నఁదగిన, ఈ మహారాష్ట్రదేశము నవనే శ్రీయుత గోఖలేగారును జనన మందు టెంతయు సమంజసము.

శ్రీయుత గోఖలేగారి పవిత్రనామము, ఇరువదవ శతాబ్దారంభమునకు ముందే భరతఖండమునం దంతటను, ప్రతి విద్యావంతుని హృదయమందును బూజనీయమగు స్థానము నాక్రమించి యుండెను. రాజకీయ విషయ పరిశ్రమలలో దాదాభాయి నౌరోజి, ఉమేశచంద్రబెనర్జి, సర్ ఫిరోజిషా మేహతా, సురేంద్రనాథ బెనర్జీ, మున్నగు దేశభక్తుల పవిత్ర నామము లెటులు భారతీయులకుఁ బరిచితములై యున్నవో, యటులే గోఖలేగారి పవిత్రనామమును భారతీయులకుఁ బరిచితమై, యనుదినస్మరణీయమై, యున్నదనుటయం దతిశయోక్తి లేదు. శ్రీయుత గోఖలేగారితో సరిపోల్పఁదగిన దేశభక్తులు మిక్కిలి యరుదని హైందవ జనసామాన్యముయొక్క యభిప్రాయము. వారికంటె నెక్కువస్వార్థత్యాగము కలవారును, నెక్కువ మేధావంతులును, నెక్కువ స్వదేశాభిమానులును, హిందూదేశమున లేరని చెప్ప సాహసింప

లేము కాని దేశాభివృద్ధికై యంత స్వల్పకాలములో నంత పట్టుదలతో నొనర్చిన ప్రయోజనకరమగు కార్య సముదాయమును బట్టియు, ప్రభువులచేతను ప్రజలచేతను బొందిన యాదరణమును, నమ్మకమునుబట్టియు, శాంత స్వభావాది సద్గుణ పుంజముచేతను, శాసన సభామంటపమునఁ జూపిన తర్క కౌశల పూర్వక వాగ్జృంభణముచేతను, ఆయన గడించిన యశస్సునుబట్టియు, పరిశీలించి చూడ నిక్కముగ శ్రీయుత గోపాలకృష్ణ గోఖలేగారే నిజమైన హిందూదేశ భక్తులని చెప్ప సాహసింపవచ్చును. ఈ విశాలక్షేత్రమునకు నాయకుఁడని పేరుపొంది జయప్రదముగ నా గౌరవమును నిర్వహించుటకు వలయు గుణరాజములీ మహనీయునియందు మూర్తీభవించినవి. పుట్టుకచే మహారాష్ట్ర బ్రాహ్మణుఁ డగుటవలనను, జన్మస్థానము మహారాష్ట్రదేశ మగుటవలనను, ఆవర్ణమునకును, ఆదేశమునకును వన్నె తెచ్చిన పీష్వాలును, ప్రజానాయకులునగు మహాపురుషుల గుణములీయనకు ఉగ్గుపాలతోనే యలవడినవి.

జననము, విద్యాభ్యాసము

గోఖలేగారు 1866 వ సంవత్సరమున రత్నగిరి మండలములోఁ జేరిన చిప్లను తాలూకాయందు జన్మించిరి. వీరి జననీజనకులు పేదవారు; కావున కుమారునకు విద్య నేర్పించి వృద్ధిలోనికిఁ దెచ్చుటకును కొంచెము వారికి కష్టముగ నుం

డెను. ఎట్టి బీదవాఁడైనను తనకుమారులకు విద్య నేర్పించుట కెన్నియో కష్టములు పడియైనను ద్రవ్య మార్జించి తన విధ్యుక్తధర్మమును నెఱవేర్ప యత్నించును గదా. అటులే గోఖలే గారి తండ్రియుఁ దన కుమారునకు విద్యాభ్యాసము చేయింపఁ బ్రారంభించెను. ముందు ముందు జగత్ప్రఖ్యాతి నొందఁ దగిన మేధావంతు లగు శ్రీ గోఖలేగా రట్టి పేదఱికమున బాల్యదశ గడపుటయం దాశ్చర్య మే మున్నది? జన్మారంభమునం దటువంటి పేదఱిక మనుభవించినవా రెందఱో మహాచ్ఛక్తి సంపన్నులై కీర్తికాములైరి. అనాథబాలికా జన సంరక్షకుఁడును కరుణారస పరిపూర్ణుండును, అగులోకమాన్య పండిత ఈశ్వరచంద్ర విద్యాసాగరులును, పేదఱికపుఁ గుటుంబమున నేకదా జన్మించినది! వారి తండ్రి నెల కేడురూపాయల మాసవేతనమును బొందుచు గొప్ప కుటుంబమును బోషించుకొని తన కుమారునకు విద్య నేర్పించుచుండెను. ఈశ్వరచంద్రులును దమ తండ్రిగారికి వంట చేసిపెట్టి రాత్రి పెద్ద ప్రొద్దువఱకు మేల్కొనియుండి పాఠములు వల్లించుచుఁ దమ చదువునను, దండ్రి పోషణముననను, లేశమేనియు లోపము లేకుండఁ జూచుకొనుచు బాల్యదశను గడపిరి. బాల్యమునందీవిధముగ పేదఱికపుఁ గష్టముల ననుభవించుటవలన ధైర్యము, క్షమ, ఉత్సాహము, కష్టముల నోర్చుకొను శక్తి, వారికి బాల్యమునుండియే యలవడి, యా సద్గుణముల

ఫలము భావిజీవితమునఁ బ్రకాశించెను. గోఖలేగారు సుమారు పదిరెండు వత్సరముల ప్రాయమున నుండఁగనే వారి తండ్రి మృతినొందిరి. నాఁటినుండియు గోఖలేగారి జ్యేష్ఠ సోదరులగు గోవిందరావుగారు వారికి విద్యనేర్పించి పోషించిరి. గోఖలేగారు స్వగ్రామముననుండు పాఠశాలలో విద్యను సంపూర్ణముగ నేర్చుకొనిన పిమ్మట పునహా, బొంబాయి నగరములలోని కళాశాలలలోఁ బఠించి, 1884 వ సంవత్సరమున బి. ఏ. పట్టపరీక్షయందు త్తీర్ణులైరి. వారన్ని తరగతులలో నుపాధ్యాయులచే మెప్పు వడయుచు వినయ విధేయులై మెలంగుచు విద్యార్థిదశను స్తోత్రపాత్రముగ సంపూర్ణము గావించిరి.

రెండవ తరంగము

ఉపాధ్యాయత్వము

గోపాలకృష్ణగోఖలేగారు బి. ఏ. పరీక్షయం దుత్తీర్ణులు కాఁగానే దక్కను విద్యాసంఘమున సభ్యులుగాఁ జేరిరి. ఈ దక్కను విద్యాసంఘము మహారాష్ట్ర దేశమునందు విద్య నభివృద్ధిజేయుటకై యా దేశమందలి ప్రముఖులగు ఆప్టే, అగర్కర్, తిలక్, మున్నగు దేశాభిమానులచే 1884 వ సంవత్సరమున స్థాపింపఁబడెను. అపుడే, పునహానగరమున

ఫెర్గూసను కాలేజి, యను పేర నొక కళాశాలయు స్థాపింపఁబడెను. దక్కను విద్వత్సంఘమున యావజ్జీవ సభ్యులుగాఁ జేరువారు, పై కళాశాలలోఁగాని యా సంఘమువారి యితర పాఠశాలలలోఁగాని, ఇరువది సంవత్సరముల కష్టకాల ముపాధ్యాయులుగా నుండవలయును. వారికి నెలకు రు. 75 లు వేతనమిచ్చి, వారి జీవితమును మూఁడువేల రూపాయలకు మరణనిధిలో భీమా చేయించి సంఘమువారు ప్రీమియములు (ముందుగాఁ జెల్లింపఁబడు వాయిదామొత్తములు) చెల్లించెదరు. ఇరువది సంవత్సరములు నౌకరిచేసిన పిమ్మట నెలకు ముప్పదిరూపాయలు ఉపకారవేతనము నొంది, ప్రతి ఉపాధ్యాయుఁడు విశ్రాంతి నొందవచ్చును. ప్రొఫెసర్లు, అనఁగా పండితోపాధ్యాయులగు వారు, కళాశాలా నివేశనములో గృహములఁ గట్టుకొనవచ్చును. వారి ఉపాధ్యాయత్వకాలము ముగిసిన పిమ్మట సంఘమువారే యాగృహములను విక్రయమునకుఁ బుచ్చుకొందురు. ప్రథమమున బి. ఏ. పరీక్షయందు జయమందినవారిని యావజ్జీవ సభ్యులనుగాఁ జేర్చు కొనుచుండిరి. కాని కొంతకాలమైన పిదప ఎం. ఏ. పరీక్షయందుత్తీర్ణులై ఆఱుమాసములు అభ్యాసకులు (Probationers)గా నున్నవారినే సభ్యులుగా నంగీకరించుచుండిరి. ఈ దక్కను విద్యాసంఘము వారికి సుమారు నాలుగు లక్షల రూపాయుల యాస్తి కలదు. మఱియుఁ బ్రభుత్వము వారును ధారా

శముగ ద్రవ్యసాహాయ్య మొనర్చుచున్నారు. ఈ ఫెర్గూసన్ కళాశాల, మన దేశీయులచే స్థాపింపఁబడి మన వారిచేతనే వ్యవస్థాపకత్వము నిర్వహింపఁబడునట్టి స్వల్పసంఖ్యా కళాశాలలలో నొక్కటి. దీనికిఁ గల పుస్తక భాండాగారమునకు రావుసాహెబు విశ్వనాథ నారాయణ మండలీకుఁడను దేశభక్తుఁడు 50 లేక 60 వేల రూపాయలు విలువగల గ్రంథముల ధర్మముగా నొసంగెను. ఈ విధముగా దక్కను విద్యా సంఘము వారు నియమముల నేర్పాటు చేసికొని, ధన మార్జించి, స్వయంకృషిమీఁద నాధారపడి, స్వార్థత్యాగులగు నుపాధ్యాయుల సాహాయ్య అనుభూతుల సంపాదించి ఫెర్గూసను కళాశాల నభివృద్ధికిఁ దేవలయునని కృతనిశ్చయులైరి. ఆ విద్యాసంఘములో సభ్యులుగ నుండు మహనీయుల పేరులు విన్నంతనే యల్పవయస్కులుగ నున్న గోఖలేగారికెంతో యుత్సాహ ముదయించుచుండెను. నిన్న మొన్నటి వఱకు మన బాలురు గోఖలేగారిని దర్శించినపుడును, వారి యుపన్యాసముల వినినపుడును, యెట్లు సంతోష తరంగముల నోలలాడు చుండిరో, యటులే గోఖలేగారును, వారి బాల్య దశలో ఆప్టే, అగర్కర్, రాణడేగారి పేర్లను వినినపుడును, వారిని దర్శించినపుడును, భక్తి గౌరవములచే నిండిన హృదయము గలవారై యుండిరి. అట్టి మహనీయుల స్నేహమును వాత్సల్యమును, సంపాదించి గోఖలే గారు దక్కను విద్యా

సంఘమునఁ జేరవలయు నని యత్నించి కృతార్థులైరి. ఆకాలమున బి. ఏ. పరీక్షయందు జయమందినవా రంత విశేషముగ లేరు. కావున బి. ఏ. పరీక్షనిచ్చిన వారికి సర్కారులోఁగాని, యితర స్థలములలోఁగాని, విశేషధనాగమముగల నౌకరులు చిక్కుట సుసాధ్యమై యుండెను. అయినను మన గోఖలేగారు, ధన మార్జించి భోగానుభవములం దేలుచు, గౌరవార్థమై దేశభక్తుల మనిపించుకొనుట కపు డపుడు కపటవేషము దాల్చి దాంభికులై యుండ నవతరించినవారు కారు. గొప్ప వేతనముల వా రాశింపనే లేదు. పదుగుర నౌకరులపై నధికారము చేయఁగల యుద్యోగములపై భ్రమపడి దేశహితమును మఱవ నిచ్చగింప లేదు. తన స్వతంత్రాభిప్రాయముల కాటంకములై, మాతృదేశ సేవకు భంగము గ నుండు వృత్తుల నంగీకరింప వారికి మనసురాలేదు. బి. ఏ. పరీక్షయందు జయమందఁగనె, గోఖలేగారు షొరఁబడక, తా నెట్టియుద్యోగము నంగీకరించిన మనశ్శాంతి యబ్బి దేశసేవఁ జేయ వలనగునో, యట్టి యుద్యోగమునకై ప్రయత్నించిరి. ఈ యాలోచనయందు వారికి గొప్పవారి సాంగత్యము చేకూరఁగాఁ గార్యనిర్ణయమున లోపము లేక ఉపాధ్యాయత్వ పదవి నంగీకరించునటుల తీర్మానించుకొనిరి. ఉపాధ్యాయులుగానుండి లోకమునకు మహోపకార మొనర్ప సాధ్యమగునని వా రభిప్రాయపడిరి కాబోలు. ఉపాధ్యాయులుగా

నుండి యనంతరము ప్రసిద్ధికెక్కిన దేశబాంధవు లనేకులు గలరు. దాదాభాయి నౌరోజీ గారు, ఈశ్వరచంద్ర విద్యాసాగరులవారు, సురేంద్రనాథ బెనర్జీగారు, బాలగంగాధర తిలక్ గారు, రామకృష్ణగోపాల భండార్కర్ గారు, లాలా హంసరాజ్ గారు, అశ్వని కుమారదత్తు గారు, ఉపాధ్యాయులుగా నుండి విద్యావిషయముల యందే గాక రాజకీయాది విషయములలోఁ గూడ పరిశ్రమజేసి స్వదేశాభివృద్ధికై కృషి సలిపిన మహనీయులు. మఱియు, మహాదేవ గోవిందరాణడే గారు, కాశీనాథ త్ర్యంబక తెలాంగ్ గారు, సర్ గురుదాస్ బెనర్జీ గారు, ఆనందమోహన్ బోస్ గారు, ఆర్. యన్. మధోల్కర్ గారు, పండిత మదనమోహన మాలవ్యగారు, ప్రథమమునఁ గొంతకాల ముపాధ్యాయులుగా నుండి, యుప్పదవి ధనార్జనాది విషయములలో విశేష లాభకారిగ నుండకపోవుటవలననో, మఱి యేకారణముననో, వృత్తుల మార్చుకొనిన దేశాభిమానులు. ఉపాధ్యాయులుగానే యావజ్జీవము కృషిసలిపి విద్యావిషయకసంస్కరణముల నొనర్చిన దేశభక్తులు పెక్కుమంది కలరు. కావున నుపాధ్యాయత్వపదవి కొందఱ అవివేకులు తలంచునటు లనాదరణీయమగు నుద్యోగము కాదు. అన్నిటికంటెఁ బూజనీయమగు పదవియే యిది. అందు లంచములు పుచ్చుకొనుటకును, అబద్ధములు కుతంత్రములు బోధించుటకును, దుర్మార్గు లని తెలిసియు నట్టి వారి

ర్తన మవలంబించి మఱింత దుష్కృత్యము లొనర్ప సహాయకారు లగుటకును, అవకాశములు మిక్కిలి స్వల్పము. అట్టి యుపాధ్యాయత్వ పదవిని గోఖలేగా రవలంబించి బాలురకు హితబోధఁ జేయుచుండిరి. ప్రతిబాలుఁడును వారియందు మిక్కిలి యభిమానము, ఆదరణము, కలిగివారిని దండ్రికంటె నెక్కుడుగఁ బ్రేమించుచుండెను. అట్టి ప్రేమకు ముఖ్యకారణము వారి సద్వర్తనమే యని చెప్పనొప్పును. ఉపాధ్యాయుఁడే దుష్ప్రవర్తకుఁడై చరించుచుఁ బాఠశాలలో హితమును బోధించి, పాఠశాల వదలఁగనే తానే బాలుర యెదుట దుర్వర్తనుఁడైన నా యుపాధ్యాయుని యెడ బాలురకు నిజమైన మర్యాదయు, ప్రేమయు జనించుట యసంభవము. అంతియగాక బాలురును తమ యుపాధ్యాయుని దుష్ప్రవర్తనలనే యవలంబింప యత్నించెదరు. కావున నుపాధ్యాయుల నియమించు నధికారము గలవారీ విషయములను గమనించి సత్ప్రవర్తకు లగువారినే నియమించవలయును. ఒక్క యుపాధ్యాయునికే యననేల, ప్రతి మానవునికిని సత్ప్రవర్తనము ప్రధానము. అందును దేశాభివృద్ధికై పాటుపడెద మని చెప్పు ప్రతి దేశాభిమానియందును, ప్రజలతోఁ గలసిమెలసి చరించు ప్రతి ప్రజానాయకునియందును, సత్ప్రవర్తనము ముఖ్యముగా గమనింపవలసిన విషయము. గోఖలేగారి జీవితమునకు వన్నె పెట్టిన దీ ప్రధానవిషయమే కదా. భాగ్యవశమున నిర్మల

హృదయుఁ డగు నృశిఖామణి తమకు గురువుగా లభించెను గాన గోఖలేగారి శిష్యులు దేశాభిమాన పూరిత హృదయులై స్వకృత్యములఁ జక్కఁగ నెఱవేర్చుచుండిరి. బాలుర యభివృద్ధికై గోఖలేగా రనేక సమాజముల నేర్పఱిచి తానే వానిని జక్కఁగ పాలించుచుండెను. మొట్టమొదట వారు బాలుర కాంగ్ల సాహిత్యము నేర్పు పండితులుగా నుండిరి. అపుడపుడు గణితమును నేర్పుచుండిరి. కాని, వారు మిక్కిలి ప్రవీణులనిపించుకొనినదియు, ఉపాధ్యాయత్వకాలములో విశేష పరిశ్రమ మొనర్చినదియు, చరిత్రవిషయకముగానే యుండెను. ఆర్థికశాస్త్రమునను, దేశచరిత్రయందును గోఖలేగారు నిరుపమాన సామర్థ్యముగలవారై ప్రసిద్ధికెక్కిరి. మఱియు, తత్సంబంధ మగు విషయములలో నెల్లర సందేహముల నివారించి, అభిప్రాయ నిర్ధారణఁ జేయుటయందును మిక్కిలి సమర్థు లనిపించుకొనిరి. బాలురకు, పాఠశాలలో వారొసంగిన యుపన్యాసములు శ్రేష్ఠతమములుగా నుండెను. ఫెర్గూసన్ కళాశాల నత్యుత్తమస్థితిలోనికిఁ దేవలయు నని నిరంతర పరిశ్రమ జేసినవారలలో గోఖలేగారు ముఖ్యులు. వారు వ్యవధి గల యపుడెల్ల నింటింటికేఁగి పై కళాశాలకై ద్రవ్యము నార్జించుచుండిరి. సెలవు దినములలోఁ దన కాలమంతయుఁ బాఠశాల యొక్క క్షేమమునకై వినియోగించిరి. ధర్మ కార్యములకు ద్రవ్య మార్జించు వా రెట్టి కష్టము లనుభవింపవలయునో యట్టి

వాని నన్నిటిని మిక్కిలి యోర్పుతో సహించి, ధార్మికుల యాగ్రహానుగ్రహములకుఁ బాత్రులై నిరంతర ప్రయాణములచేఁ గలుగు సంకటముల సంతోషముతో సహించి, కాలక్రమమున వారు పాఠశాలకు సుమారు రెండులక్షల రూప్యముల మూలధన మేర్పఱిచిరి. ఫెర్గూసను కళాశాలలో నందఱ పండితులవలె వారొక పండితులైనను, ప్రధానోపాధ్యాయ (ప్రిన్సిపల్) పదవిలో వా రెన్న డుండకపోయినను, వారి ధర్మనియతియు, స్వార్థత్యాగమును, నిరంతర పరిశ్రమయు, సద్వర్తనమును, తత్కళాశాలయందలి యుపాధ్యాయులందఱికంటె వారు ప్రతిబాలుని హృదయమునందు నత్యున్నత స్థానము నొందునటుల జేసి గణన కెక్కినవి. అట్టి పూజ్యులగు గురువర్యులఁ బాయు సమయము తటస్థింపఁగా బాలురును కళాశాలాధికారులును గోఖలేగారి ననేకవిధములసన్మానించి సభలుగావించి తమ అనురాగమును దుఃఖమును వెలిబుచ్చిరి. 1902 వ సం॥రం సెప్టంబరునెల తే 19 దిన జరిగిన సభలో సభ్యులొనర్చిన గౌరవమునకై గోఖలేగా రిట్లు ప్రత్యుత్తర మిచ్చిరి. " నేఁటికి పదునెనిమిది సంవత్సరముల నుండియు నా శక్తికొలఁదిఁ జేయఁగలిగిన దంతయుఁ జేసితిని. సంఘాభివృద్ధికై పాటుపడ యత్నించితిని. కాలానుకూల ప్రతికూలముల లెక్కగొనక కళాశాలాభివృద్ధికై యేకాగ్రచిత్తతతో జంకక కృషినలిపితిని. తుదకుఁ గళాశాలను వదలుటయన దుస్సాధ్య

ముగ నున్నది. అయినను నేను బాల్యోత్సాహ ప్రేరణచే గావిం
చిన ప్రతిజ్ఞప్రకార మీ కళాశాలయందు నియమితకాలమును
గడ్పగల భాగ్యమును నాకు బ్రసాదించిన భగవంతున కనేక
వందనములు. నా ప్రతిజ్ఞను నెఱవేర్ప గలిగినందులకు నేను
సంతోషము నందుచున్నను, చాలసంవత్సరములనుండి స్నేహ
సోదరభావముల మెలంగుచుండిన మిమ్మందఱను వదలవలసి
వచ్చినందునకును, నావిద్యాబలముల నెల్ల నెందువినియోగించితి
నో అట్టి ఈ కళాశాలను వదలవలసివచ్చినందునకును, మిక్కిలి
దుఃఖపరవశుఁడనై యున్నాఁడను. కాని 'మమ్మేల వదలుచు
న్నారు? ఇచ్చటనే మఱి కొంతకాల ముండ రాదా ?' యని
మీరడుగవచ్చును. ఈవిషయమై నేను సంపూర్ణముగ నాలో
చనచేసియే యీతీర్మానమునకు వచ్చితిని. ప్రథమకారణ
మేమన నాయారోగ్య మిటీవల చెడినది. కడచిన సంవత్సర
మున నేను నాకృత్యముల నా సహోపాధ్యాయుల వలెఁ
గ్రమముగా నెఱవేర్ప లేక పోతిని. నాయం దభిమానముకల
వారగుటచే నామిత్రులు సహాయ మొనర్చు చుండినను, వారి
నిరంతరము శ్రమనొందఁ జేయుట న్యాయ్యము కాదుగదా!
ఇది యొక ముఖ్యకారణము, మఱి యొకటి, లోకోపకార విష
యములకై సర్వకాలమును వినియోగించి కృషి సలుపవలె
ననెడి యభిలాష గలిగిన దేశసేవకుని జీవితమున ననేక సంక
టములు కలుగు ననియు, భారము హెచ్చుననియు, నిరుత్సా

హము విశేషమనియు, తెలిసియుండియు నాహృదయము మట్టి జీవితమునకే పరితపించుచున్నది. ఒక్కటి మాత్రము స్పష్టము. దేశసేవావిషయమై నావలెనే విచారించువారు స్వార్థమును త్యజించి, ఉత్సాహమును నమ్మకమును గలిగి, మనస్ఫూర్తిగాఁ బనికిఁ బూనిననే గాని కృతార్థులు కానేరరు. మీరందఱు నాకొనర్చిన వీడుకోలుమహోత్సవము వలన నాకు కలుగు సంతోషమును, మీపట్ల నాకృతజ్ఞతయును, నేను వచింప శక్తిలేకయున్నాను. మీ కందఱకును శుభమొనఁగూడుఁ గాక! ఈ కళాశాల మిక్కిలి యభివృద్ధి నొందును గాక!”

ఈయుదారవాక్యములనుడివి నెలకు రు.30ల యుపకార వేతనముతో వారుపాధ్యాయత్వపదవిని వదలిరి. 18 సంవత్సరములు పనిచేయఁగా రెండు సంవత్సరముల సెలవు వారికి రావలసియుండెను. దానితో గూడ 20 వత్సరముల నియమితకాలమును వారు పూర్తిచేసిరి.

మూఁడవ తరంగము

ఉపాధ్యాయత్వమున నొనర్చిన దేశోపయోగ కార్యములు

గోఖలేగారు 1884-వ సంవత్సరము మొదలు 1902-వ సం॥ వఱకు నుపాధ్యాయులుగా నుండినను ఈ 18 సంవత్సరములలోఁ గూడ దేశసేవను మఱువక రాజకీయాది విషయములలోఁ దగినంత శ్రద్ధను జూపుచుండిరి. అక్కాలమున పునహానగరమందు హిందూదేశ భక్తాగ్రగణ్యులలో నొకరగు శ్రీయుత మహాదేవ గోవింద రాణడేగారు ప్రజానాయకులుగ నుండి స్వల్పవయస్కు లగు దేశాభిమానుల కెల్ల మార్గదర్శకులై యుండిరి. గోఖలేగారి యదృష్టవశమున వారికి రాణడేగారి సేవ లభ్య మయ్యెను. పదునాలుగు సంవత్సరముల కాలము వారు శిష్యభావముతో రాణడేగారి యొద్ద శిక్షనొందిరి. గోఖలేగారి జీవిత ప్రఖ్యాతికి ముఖ్యకారణ మిది యొకటి. రాణడేగారియొద్ద గోఖలేగారు లోకానుభవమును, చారిత్రకసారమును, అర్థశాస్త్రసారమును, ఇంతయేల, దేశసేవకున కావశ్యకములగు సకల విషయములను నేర్చుకొని ధన్యులైరి. గోఖలేగారు తమగురువులగు శ్రీరాణడే గారిని గూర్చి 1903-వ సంవత్సరమున బొంబాయిలో జరి

గిన రాణడేవర్ధంతి మహోత్సవసమయమునఁ బ్రసంగించుచు
నిట్లుచెప్పిరి. "నాయనుభవమున హిందూదేశీయులలో శ్రీ
రాణడేగారివలె రాత్రింబగళ్లు స్వదేశమును గుఱించియుఁ
దన దేశప్రజల క్షేమాభివృద్ధిని గుఱించియు నాలోచించు
దేశాభిమాని మఱియొక్క రేకలరు. వారు దాదాభాయి
నౌరోజీగారు." రాణడేగారు గొప్పదేశాభిమాని, మతబోధ
కుఁడు, సంఘసంస్కర్త, రాజ్యాంగధురీణుఁడు, న్యాయ
వాది, చరిత్ర శాస్త్రజ్ఞుఁడు. అట్టి వానిని గురువుగా గ్రహిం
చిన శ్రీ గోఖలేగారి భాగ్యమే భాగ్యము. పుణ్యనగరము
నందు సార్వజనికసభ యనుపేర నొక మహాజనసభను స్థాపించి
యద్దాని యభివృద్ధికై రాణడే మున్నగు ప్రముఖులు పాటు
పడుచుండిరి. ఈ సభ యొక్క యుద్దేశము దేశాభివృద్ధికై దేశ
సేవ సేయుట; రాజకీయాందోళనమున, నా సభవారి యభి
ప్రాయములు ప్రజాభిప్రాయములుగా నెన్నఁబడి పరిపాలకు
లకు గౌరవార్హములుగ నుండెను. మఱియు నా సభవా
రొక త్రైమాసపత్రికను బ్రచురించుచు తద్ద్వారా రాజ్యాం
గపద్ధతులను గూర్చియు, హిందూదేశీయార్థికస్థితిని గూర్చియు,
బ్రజలకు సరియైన యభిప్రాయములఁ దెలియఁబఱచి జ్ఞానాభి
వృద్ధిం గావించుచుండిరి. ఆ పత్రికకు వ్యాసము లనేకములు
శ్రీరాణడేగారే వ్రాయుచుండిరి. పత్రికయుఁ గడు ప్రయో
జనకారిణి యై ప్రఖ్యాతిం గాంచెను. అంత ప్రఖ్యాతిగాంచిన

పత్త్రికకు సంపాదకుఁడుగా నుండుటకు శ్రీయుతగోఖలేగారు సార్వజనికసభవారిచే 1887-వ సంవత్సరమున వరింపఁబడిరి. అప్పుడు గోఖలేగారు 21 సంవత్సరముల ప్రాయమున నుండినను వారి కుశాగ్రబుద్ధి యప్పటికే మిక్కిలి సంస్తవనీయముగ నుండుటచే నుపాధ్యాయపదవితోఁ గూడ పత్రికాధిపతిత్వమును లోపము లేకుండ జరుపఁగల సామర్థ్యము, నేర్పు, గోఖలేగారికి కల దని పత్త్రికాధిపతులకు దృఢమైన నమ్మకముండెను. మఱియు వీనికి తోడుగ సార్వజనిక సభయొక్క కార్యదర్శిపదవియు గోఖలేగారికే యొసంగఁబడెను. ఈ వివిధకృత్యములను వారు లోపములేకుండ నిర్వర్తించుచుండిరి. కొంతకాల మైనపిదప సార్వజనిక సభయొక్క సభ్యులలో మనస్స్పర్థలు కలుగగా నా సభ రెండు భాగములై 'దక్కనుసభ' యనుపేర నం దొకటి స్థాపింపఁబడెను. గోఖలేగా రట్టివిభాగము కలుగకుండుటకై యత్నించిరి గాని యది దుస్సాధ్యము కాఁగా సార్వజనిక సభను వదలి దక్కను సభయందు కార్యదర్శిగాఁ జేరిరి. మఱియు 'సుధాకర' యను నాంగ్లేయ మహారాష్ట్రవార పత్త్రికకు నాలుగు సంవత్సరముల కాలము వారు సంపాదకులుగా నుండి దానిని ప్రచురించిరి. వారు బొంబాయి రాజధాని సభకు నాలుగు సంవత్సరములు కార్యదర్శిగా నుండిరి. 1895-వ సంవత్సరముఁ బదునొకండవ

హిందూ దేశీయమహాజనసభ పునహా నగరంబున సమావేశమాయెను. అపుడు గోఖలేగారు స్వాగతసంఘ కార్యదర్శులలో నొకరుగ నుండి మహాసభను జయప్రదముగ నిర్వహించిరి.

1897-వ సంవత్సరమున గోఖలేగారు ఇంగ్లాండులో వెల్బీ కమీషను వారియొద్ద సాక్ష్య మిచ్చుటకై నియమింపఁబడిన హైందవ ప్రజానాయకులలో నొకరుగ సీమకు వెళ్లిరి. ఈ వెల్బీకమీషను శ్రీమద్విక్టోరియా మహారాణిగారిచే హిందూదేశీయాదాయవ్యయములం గూర్చి విచారించుటకై యేర్పాటుచేయఁబడెను. ఆ సభ్యులలో మన దాదాభాయినౌరోజీగా రొకరుగ నేమింపఁబడిరి. హిందూదేశ ప్రజానాయకులను గొప్ప యుద్యోగీయులను విచారించి హిందూదేశ రాజ్యాంగపద్ధతిని గుఱించియు, నేయే విషయములలో నెట్లెట్లు ద్రవ్యము వ్యయమగుచున్నదియు నారయుటకును ఆ వ్యయమును తగ్గించుటకును హెచ్చించుటకును సాధనోపాయముల గమనించుటకును, స్వదేశజుల యభిప్రాయములను గనుగొనుటకును శ్రీమహారాజ్ఞిగారిచే నా సభ యేర్పాటుచేయఁబడినది. ఆ సభవారియొద్ద స్వాభిప్రాయము లిచ్చుట కర్హులైన హైందవులను ఇండియాగవర్నమెంటువా రేర్పరచి పంపిరి. గోఖలేగారి కంటె వయస్సునందును లోకానుభవమునను పెద్దలగువా రనేకు లీపనికి నియోగింపఁబడిరి. వారితోఁగూడ

గోఖలేగారును, సీమకేఁగి, వయస్సునఁ జిన్నవారైనను బుద్ధి సూక్ష్మతను శాస్త్రజ్ఞాన పరిశీలనమునను తక్కినవారికంటె పెద్దయని ప్రఖ్యాతి వెలయునటులు, నిర్భయముగను నిష్పక్షపాతముగను సాక్ష్యమిచ్చిరి. ఆకమీషను సభ్యులలోఁ గొందఱు గోఖలేగారి యభిప్రాయములను నిరోధించుచు ననేక ప్రశ్న లడిగిరి. కాని సామర్థ్యముతో యుక్తియుక్తముగ వాని కన్నిటికి వారు ప్రత్యుత్తరము లిచ్చిరి. తత్సభ్యాగ్రేసరుఁడగు వెల్బి ప్రభువుగారు కొన్ని సమయములలో గోఖలేగారిని వాగ్వివాదమున నోఁబఱుచుకొన యత్నించిరి కాని విఫలమనోరథు లైరి. వారి సాక్ష్యమంతయు సహేతుకములగు నిదర్శనముల తోడఁ గూడిన దగుటవలన గోఖలేగారి నోడించుట కాంగ్లేయసభ్యులకు వలను పడినదికాదు. ప్రభుత్వముయొక్క ప్రతిశాఖలో నేయే మార్పులు జరుగవలసినదియు, నేయే శాఖలలో నేయే యుద్యోగము లనావశ్యకములైనదియు, నేయే యుద్యోగములకు హైందవులనే నియమింపవలసినదియు, మొదలగు విషయములను గోఖలేగారు పూర్ణముగా విపులముగా వక్కాణించిరి. గోఖలేగారు వెల్బికమీషను వారియొద్ద నొసంగిన సాక్ష్యమంతయు నొక పెద్ద గ్రంథముగఁ బ్రచురింపఁబడి యున్నది.

వారు వెల్బికమీషను వారియొద్ద సాక్ష్యమిచ్చుటకై వెళ్లి, ఇంగ్లాండులో నున్న సమయమున హిందూదేశమున

బొబ్బల జాడ్యము, ముఖ్యముగ బొంబాయి ప్రాంతములలోఁ బ్రబలమగుచుండెను; పునహా నగరమందును విశేషముగ నుండెను. ఆ సమయమునఁ బ్రభుత్వమువారు జాడ్యనివారణ మార్గములఁ గొన్నిటి నవలంబించిరి. వాని నమలులోఁ బెట్టుటకై నియమింపఁబడిన ఆంగ్లేయులగు సిపాయీలు కొందఱ క్రమముగా వర్తించుచు, స్త్రీపురుషుల హింసించుచున్నారనియు ప్రభుత్వమువా రవలంబించిన పద్ధతులు ప్రజలను సంకటముల పాలుచేయుచున్న వనియు, పునహానగరవాసులు కొందఱు, ఇంగ్లాండులోనున్న గోఖలే గారికిఁ దెలియఁబఱిచిరి. వా రా వార్తల సత్యాసత్యముల దృఢపఱుచుకొనుటకై యత్నింపక దూరదేశమున నున్న తన దేశీయు లగు స్త్రీపురుషు లెట్టి బాధల ననుభవించుచున్నారో, లేకున్న నిట్టి యుత్తరము లేల వచ్చునని తలంచి యందలి యంశములఁ దక్షణమే ఇంగ్లాండులోని వార్తాపత్రికలలోఁ బ్రచురింపఁజేసిరి. దానిపై నింగ్లాండులో కొంత కలవరము జరుగఁగా, బొంబాయి గవర్నమెంటువారు తమపై మోపఁబడిన నేరము లసత్యములనియు, అన్యాయముగఁ బ్రభుత్వమువారిపై నట్టి ద్వేషములు కలుగఁ జేయ యత్నించుట రాజద్రోహమనియు భావించి, గోఖలేగారు ప్రచురించిన లేఖలలోని విషయముల రుజావు పరుపవలసినదిగా ప్రభుత్వమువారు గోఖలేగా రీదేశమునకు వచ్చిన తర్వాత నాజ్ఞాపించిరి. వారు యథార్థమును విచా

రింతమని తలంచిరిగాని ప్రజ లనేకులు క్షామపీడితు లయ్యు ప్లేగుజాడ్యమువలన నశించియు మిక్కిలి శోచనీయమగు స్థితిలో నుండఁగా, తనకు తెలుపఁబడిన యంశముల ఋజువుచేయుటకుఁ దగిన వసతులు లేక చిక్కువడిరి. అటువంటి సందర్భమునఁ గర్తవ్యమును నిదానముగ నాలోచించి, ఆధారరహితముగఁ దాను పొరబడినందుకు వగచి ప్రభుత్వమువారి క్షమాపణమును గోరిరి. ప్రభుత్వమువారును తత్ క్షమాపణము నంగీకరించిరి. గోఖలే గారట్లు క్షమాపణమును కోరినందులకు స్వదేశీయులు కొందఱు వారినిఁ దూలనాడిరి. కాని వా రపుడు చేసినపని తప్పని వారి కేమాత్రము తోఁపలేదు; మఱియు తన కట్టి సందర్భము తటస్థించినందునఁ దన భావి జీవితమునందు జాగరూకతఁ గలిగి మెలంగుటకుఁ గారణమయ్యెనని సంతసించిరి. మూర్ఖపుఁబట్టుదలవలన లాభము లేదనియు, కార్యసాఫల్యము నందఁ దలఁచిన ప్రతిమానవుఁడును సమయాసమయములను మంచి సెబ్బరలను గమనించి వర్తింపవలయుననియు గోఖలేగారి యభిప్రాయము. ఆపదలవలననే మనుజుని ధైర్యము నిజముగ బయలుపడును. గోఖలేగారు తమకుఁ గష్టము సంభవించినదని ధైర్యమును విడనాడక కర్తవ్యముల తత్ క్షణమే ప్రారంభించిరి. వారు జాడ్యగ్రస్తు లుండు స్థలములకుం జని వ్యాధినివారణమార్గముల నాలోచించి ప్రభుత్వమువారికి మనవి చేయుచు నధి

కారుల కెంతో సహాయులై యుండిరి. క్షామ మేయే ప్రాంతములలో విశేషముగ జనుల బాధించుచుండెనో యచ్చటికి వెళ్లి తమచేత నైనంతవఱకుఁ బ్రజలకును బ్రభుత్వమువారికిని సేవ యొనర్చుచుండిరి.

బొంబాయి శాసనసభా సభ్యత్వము

గోఖలేగారు 1900-వ సంవత్సరమున బొంబాయి రాజధానిలోని షోలాపురము, నాసిక్ మొదలగు జిల్లాల వారిచే బొంబాయి శాసన నిర్మాణసభకు సభ్యులుగా నెన్నుకొనఁబడిరి. తత్సభలో 1900-01 సంవత్సరమందలి యాయవ్యయ పట్టికయొక్క విమర్శన సందర్భమునఁ గోఖలేగా రొసంగిన యుపన్యాసమునఁ బ్రభుత్వము వా రవలంబించిన క్షామ నివారణ పద్ధతులయందుఁ గల లోపములను వాని వలనఁ బ్రజలకుఁ గలిగిన నష్టమును వారు సహేతుకముగఁ బ్రజలకు నివేదించిరి. 1901-వ సంవత్సరము మేనెలలో బొంబాయి ల్యాండ్ రివిన్యూను గురించి సభలో సర్కారు వారొక బిల్లును బ్రవేశపెట్టిరి. ఆ బిల్లువలన బొంబాయి భూస్వాములకుఁ గష్టములు సంభవించు నని తత్సభలోని ప్రజా ప్రతినిధులకుఁ బూర్ణమైననమ్మక ముండెను. సర్ ఫిరోజిషా మెహతా మున్నగు వా రాబిల్లును నిలుపవలసిన దనియు, నందుఁ బెక్కు సవరణలు కావలయు ననియు దీర్ఘోపన్యాసములు చేసిరి. గోఖలేగారును దమ శక్తికొలఁది బిల్లు ప్రక్రి

తము వలదనుటకుఁ గల కారణముల నన్నిటినిఁ జేర్కొ-నుచు నిర్భయముగ నుపన్యసించిరి. ఆ యుపదేశము లను ప్రభుత్వమువారు పెడచెవినిబెట్టి బిల్లును కమిటీవారి యభిప్రాయములకుఁ బంపిరి. కమిటీవారి సలహాల నాలోచిం చుటకు 1901 సంవత్సరము ఆగస్టునెల 23-వ తేది మరల సభ సమావేశమయ్యెను. అపుడు మెహతాగారు ఆబిల్లును మఱికొందఱు పెద్దమనుష్యులకును, సభలకును, సంఘముల కును అభిప్రాయమునకై పంపవలయుననియు, వారొసంగు నభిప్రాయముల ననుసరించి సవరణలఁగావించుటకై బిల్లును మరల నిర్వచితసంఘము (సెలెక్టుకమిటీ) వారికిఁ బంపవలయు ననియుఁ దీర్మానము నుపపాదించిరి. ఆతీర్మానమును గోఖ లేగారును బలపఱిచిరి. అనేకప్రజలను గష్టములపాలు సేయు నట్టి బిల్లును, ప్రజాభిప్రాయమును దెలుపుకొనుటకు సరి యైన కాలమియ్యక త్వరపడి యమలులోఁబెట్ట యత్నించుట న్యాయ్యము కాదనియు, ప్రజలు దాఖలు చేసికొనిన మనవి అర్జీలను విమర్శింపకయే బిల్లును ప్యాసుచేయుట యక్రమ మనియు, నొక్కి-చెప్పుచు గోఖలేగా రిచ్చిన యుపన్యాసములు ప్రభుత్వోద్యోగీయుల వీనులకు ములుకులవలె సోఁకినవి. కాని యాతీర్మానమును ప్రభుత్వమువా రంగీకరింపక పోయిరి. అంతట మాననీయులగు మెహతా, ఖరే, పేరక్, షర్ బాలచంద్ర కృష్ణ, యను ప్రజాప్రతినిధులు ప్రభుత్వము

వారు తమ యుపదేశము నంగీకరించనందునకై తమ యసమ్మతిని దెలుపుచు సభవదలి వెళ్లిరి. అంత గోఖలేగారును, తాను సభలోనుండఁగా నట్టిబిల్లు ప్యాసగుట తన కిష్టము లేదని చెప్పుచు గవర్నరుగా రగు వార్డుకోట్ ప్రభువుగారి యాజ్ఞఁగొని సభను వదలివెళ్లిరి. ఈ విధముగఁ బ్రజానాయకులంద ఱొకేసమయమున శాసననిర్మాణసభను ధైర్యముతో వదలగా ప్రభుత్వమువా రమలులోఁ బెట్టఁదలఁచిన చట్టము బొంబయి దేశవాసుల కెంతకష్టముగ నుండెనో యని హిందూదేశీయులెల్లరు గమనించిరి. అపుడు గోఖలేగారు సభలో నొసంగినయుపన్యాసము వారు బొంబాయి శాసననిర్మాణసభలో నొసంగిన యుపన్యాసముల నన్నిటికంటె ధీరభావగుంభిత మైయున్న దని ప్రజ లనుకొనిరి. 1901-వ సంవత్సరమందలి యాదాయవ్యయపట్టిక యొక్క విచారణ సందర్భమున పన్నులు వసూలుచేయుటయందును, ముజరా యిచ్చుటయందును, కొన్నినూతనపద్ధతులను వారు ప్రభువులకు నివేదించుచు నుపన్యసించిరి. మఱియు వారు బొంబాయి సభలోఁ బెక్కుబిల్లులను గుఱించి యుపన్యసించి ప్రజలు తనమీఁద వైచిన భారమును శ్లాఘనీయముగ నిర్వహించిరి.

నాల్గవ తరంగము

సామ్రాజ్యశాసన సభ్యత్వము

1902-వ సంవత్సరమున సామ్రాజ్యశాసన నిర్మాణ సభ్యు లగు సర్ ఫిరోజిషా మెహతాగారి నియమితకాలము ముగిసెను. వారు బొంబాయి శాసననిర్మాణ సభలోని యనధికార సభ్యులచే సామ్రాజ్యశాసన నిర్మాణసభ కెన్నుకొనఁబడిన ప్రజాప్రతినిధులు. వా రెట్టి సామర్థ్యముతోఁ దత్కార్యమును నిర్వహించినదియు సర్వజన విదితమే. మెహతాగారు తమ కాపదవి యనావశ్య మనియు తాను నిర్వహింపఁజాల ననియుఁ జెప్పగా, ప్రజలును ననధికార శాసన నిర్మాణసభా సభ్యులును, నుంచిసామర్థ్యము గల వానిఁ దమ ప్రతినిధిగా నెన్నుకొనవలెనని తర్కించుకొని, తుద కాగౌరవమును గోఖలేగారి కొసంగవలయు నని తీర్మానించుకొని, యటు లొనర్చిరి. అప్పటి సామ్రాజ్యశాసన నిర్మాణ సభ్యులకందఱికంటెఁ జిన్నవాఁడనియు నంత స్వల్పవయస్కుఁ డెన్నడును సభ నలంకరింప లేదనియు, ప్రజలు గోఖలేగారిని మిక్కిలి యభినందించిరి. నాఁటినుండియు జీవితాంతమువఱకు సుమారు పండ్రెండుసంవత్సరముల కాలము గోఖలేగా రాపదవిని సర్వజనస్తోత్రపాత్రముగ నిర్వహించిరి.

వారు సామ్రాజ్య శాసననిర్మాణసభలోఁ బ్రవేశించిన కాలమున, అనఁగా 1902-వ సంవత్సరమున కర్జన్ ప్రభువు గారు హిందూదేశ రాజప్రతినిధిగ నుండిరి. ఆ సంవత్సరము మార్చి నెల 26 తేది నాయవ్యయ పట్టికయొక్క చర్చ ప్రారంభ మయ్యెను. ఆ చర్చ ననుసరించి గవర్నమెంటు వారి కోశాధ్యక్షుఁడగు సర్ యెడ్వర్డులా దొరవారు తమ పట్టికను బ్రవేశపెట్టి యా సంవత్సరము 7 కోట్ల రూపాయ లాదాయమని చెప్పిరి. సభ్యు లనేకులు మంత్రిగారి నభినందించుచు నుపన్యసించిరి. కాని, ప్రథమోపన్యాసము యొక్క ప్రథమ వాక్యముననే, తాను మనఃపూర్వకముగ ప్రభుత్వమువారి నభినందింపఁజాలనని చెప్పి, ప్రజలవలనఁ బరిపాలనకై వసూలుచేసిన ద్రవ్యములో నంత విశేషముగా ద్రవ్యము మిగులుటకుఁ గారణము దురూహ్య మనియు, ఆసంవత్సరమే కాక తత్పూర్వముకూడ ననేక సంవత్సరములనుండి ద్రవ్య మంత విశేషముగా మిగులుటవలనఁ బ్రభుత్వమువా రవలంబించు పద్ధతులలో లోపము లుండియుండవలె ననియు, పరిపాలన కావశ్యకమైన దానికంటె నెక్కువగ పన్నులు విధించి వసూలు చేయుటవలన ద్రవ్యము విశేషముగ మిగులుటకుఁ గారణమాయెననియు, క్షామపీడితులై యున్న ప్రజలవలన నంత యెక్కువపన్నులు వసూలుచేయుట యక్రమ మనియు, ప్రభుత్వమువారికి నివేదించి, నిర్భయముగఁ దా నుదువు ప్రత్యంశ

మును దృఢపఱచుచు గోఖలేగా రుపన్యసించిరి. ఈ యుప న్యాసమును పఠించిన విద్యావంతు లెల్లరు సామ్రాజ్యశాసన నిర్మాణసభకు భూషణముగ గోఖలేగారి నంపిన బొంబాయి శాసన నిర్మాణ సభవారిని, దానికవకాశము నొసంగిన సర్ ఫిరోజిషా మెహతాగారిని, కొనియాడిరి. ప్రజలును తమ పక్షమున నంతటిసామర్థ్యముతో వాదింపగల యాదేశాభిమా నికి వందనము లొనర్చిరి. ప్రభుత్వమువారును తమ లోపముల కొన్ని చక్కఁబఱచుకొనువిషయమై క్రమక్రమమున నాలో చించిరి. ప్రతి సంవత్సరము నాయవ్యయ పట్టికను చర్చించు నపుడు గోఖలేగారు పన్నులను కొన్ని తగ్గింపవలయు ననియు, విద్యాభివృద్ధికిని, ఆరోగ్యాభివృద్ధికిని, ద్రవ్యమును విశేష ముగ హెచ్చింపవలయు ననియు, రైల్వేమున్నగుశాఖలయం దలి ఖర్చుల తగ్గింపవలయు ననియు సాంవత్సరికపులెక్కలను జూపి సహేతుకముగను స్పష్టముగను సభ్యులకును ప్రభుత్వ మువారికిని విన్నవించుచుండిరి. వారి యుపన్యాసము లన్నియు సఫలములు గాకున్నను, ఉప్పుమీఁది పన్ను, వరుంబడి పన్ను తగ్గింపఁబడుటయు విద్యాదిప్రయోజనకరము లగు విషయ ములలో ద్రవ్యము విశేషముగ హెచ్చింపఁబడుటయు, కొంత వఱకు వారి యుపన్యాసముల ఫలమే యని చెప్పవచ్చును.

చెన్నపురివారల స్వాగతము

1904-వ సంవత్సరము జూలై నెలలో గోఖలేగారు హిందూదేశీయ మహాజనసభయొక్క కార్యదర్శిగాఁ దత్సభా

కార్యములకై మదరాసు పట్టణమునకు విచ్చేసిరి. చెన్నపురీవాసులు వారికిఁ దగిన స్వాగత మిచ్చి గౌరవించిరి. ప్రజాప్రతినిధుల సంఘములు స్వాగతపత్త్రికలలో గోఖలేగారి సామర్థ్యములఁ బేర్కొనుచు వారి నభినందించినవి. విద్యార్థులు వారిం దర్శించుట కుత్కంఠితులై వారి నివాసస్థలమున గుంపులు గుంపులుగా గుమికూడి వారిం దర్శించియు, వారితో సంభాషించియు, నానందపరవశు లైరి. ఈ సమయముననే, కీర్తిశేషు లగు మహాదేవగోవింద రాణడేగారి జ్ఞాపకచిహ్నముగ నీరాష్ట్రప్రజ లేర్పఱుపఁదలంచిన 'రాణడే' పుస్తకభాండాగారమునకు శంకుస్థాపనము చేయుటకై గోఖలేగారిని తన్నగరవాసులు ప్రార్థించిరి. అందుల కియ్యకొని జూలై నెల 24 తేదిన గోఖలేగా రా కార్యము నొనర్చుచు తమ గురువుగా రగు శ్రీరాణడేగారి గుణగణములం బేర్కొనుచు నుపన్యసించి సభ్యులను సంతోషపఱచిరి.

బొంబాయి కాంగ్రెసు

ఆసంవత్సరమే బొంబాయినగరమున జరిగిన హిందూదేశీయ మహాజనసభయందు గోఖలేగారు 'సర్ప్లసెస్' అనఁగా ప్రతి సంవత్సరము గవర్నమెంటువారి యాదాయవ్యయపట్టికలో మిగులుచున్న ద్రవ్యమును గురించి మాటాడుచు నా ద్రవ్యశేషమువలన హిందూదేశ మభివృద్ధిచెంది

వదనిగాని, ప్రజలు మునుపటికంటె నిపు డైశ్వర్యవంతు లై రనుటకుఁ గాని, లేశమేనియు నాధారములేదనియు, పాలకులు ప్రజలవలన నెక్కువగా పన్నులు వసూలు చేయుచున్నా రనియు, అనేకసంవత్సరములనుండి మిగులుచున్న యా ద్రవ్యమును ప్రజాభివృద్ధికరము లగు మార్గములలో ననఁగా విద్యాభివృద్ధికిని, వైద్యసాహాయ్యాభివృద్ధికిని, స్థానికపరిపాలనాభివృద్ధికిని, ఉపయోగించుచుఁ బ్రజల కష్టముల కొంతవఱకు నివారించుటకై కొన్ని పన్నులను తగ్గించవలయుననియు, ప్రభుత్వమువారిని బ్రార్థించుచు నొకతీర్మానము నుపపాదించిరి. ఈ తీర్మానమందలి యంశములనే వారు పలుమారు ప్రతి సంవత్సరము శాసననిర్మాణసభలో రాజప్రతినిధిగారి యెదుటనే విన్నవించుచుండిరి. కాని దేశీయ మహాజనసభలో నా విషయమై విపులముగాఁ బ్రజలకు బోధ జేయుటవలన సభ్యులంద ఱేకగ్రీవముగ వారి యభిప్రాయములతో నేకీభవించి ప్రభువులకు దేశీయాభిప్రాయమును దెలియఁజేయుట కవకాశము కలిగెను.

గౌరవ బిరుదము

గోఖలేగారి దేశాభిమానమునకు కర్జన్ ప్రభువుగారు సైతము మెచ్చుకొని ఈ సంవత్సరమే వారికి "సి. ఐ. ఇ." అను బిరుదము నొసంగి గౌరవించిరి.

1905-వ సం॥ ఆదాయవ్యయ పట్టిక

1905-వ సంవత్సరమున గోఖలేగారు మరల సామ్రాజ్య శాసననిర్మాణసభ కెన్నుకొనఁబడిరి. ఆ సంవత్సరపు టాదాయవ్యయములను గూర్చిన చర్చలో హిందూదేశీయులకు గొన్ని నౌకరు లిచ్చుచునేయున్నార మని పాలకులు చూపిన లెక్కలను విమర్శించి, యా లెక్కలలోఁ దప్పులను బయలుపఱిచి, తన సొంతలెక్కల నెంతయో ప్రయాసముతో సిద్ధముసేసి పాలకులకు విన్నవించిరి. ప్రతి సంవత్సరము ద్రవ్యము విశేషముగ మిగులుచున్నదని గోఖలేగారు శాసననిర్మాణసభలో మొఱపెట్టుచున్నందునకు ఫలితముగ నీ సంవత్సరము ప్రారంభవిద్యాభివృద్ధికై ప్రదేశరాష్ట్రపాలకులకు 30 లక్షల ద్రవ్య మొసంగఁబడెను. పోలీసుశాఖలో సంస్కరణములఁ జేయుటకై 50 లక్షల రూపాయలను, వ్యవసాయ శాఖాభివృద్ధికై 20 లక్షలును, స్థానికపాలనసభలకు, అనఁగా లోకల్‌బోర్డులకు 56½ లక్షలును విరాళముల నొసంగిరి. ఈ విధముగ నీ సంవత్సరమున వ్యయముచేయఁ దలంచినందులకు, గోఖలేగారు పాలకుల నభినందించిరి. కాని, యిప్పటికిని ప్రభుత్వమువారు సేనాభివృద్ధికై వ్యయముచేయఁదలంచి యాసంవత్సరపు బడ్జటులో సూచించిన 3 కోట్ల 66 లక్షల రూపాయలను గుఱించియు, పన్నులు మొదలగు మరి కొన్ని విషయములను గుఱించియు, తమ యస

స్మృతిని దెలుపుచుఁ బ్రభుత్వోద్యోగీయుల వాదముల ఖండించుచు నుపన్యసించిరి.

ఐదవతరంగము

హిందూదేశసేవక సంఘస్థాపనము

ఈ సంవత్సరమే గోఖలేగారు హిందూదేశమునకొనర్చిన గణనాతీత మగు మహోపకారములలో మిక్కిలి ముఖ్యమైన దగు హిందూదేశసేవక సంఘస్థాపనము ప్రారంభ మైనది. ఈ సంఘమును స్థాపించుటకు వారు కారణముల నిటులు సెప్పిరి. "పాశ్చాత్యవిద్య దేశములో వ్యాపించినకొలఁదిని దేశీయుల మనంబులు స్వాతంత్ర్యేచ్ఛకును, జాతీయభావంబునకును, నిలయము లగుచున్నవి. గతించిన యేఁబది సంవత్సరములనుండియు దేశమునం దనేకోద్యమములు వెలువడి దేశీయులను దేశసేవాతత్పరులనుగ జేయుచున్నవి. దేశీయ మహాజనసభ, పారిశ్రామిక సభ, రాజధాని మండలసభలు, మొదలగునవి యుద్భవిల్లి దేశాభ్యుదయమునకుఁ దోడ్పడుచున్నవి. వీనికొఱకనేకులు మహాజనులు తమ ధనమును, విద్యను, జీవితమును నర్పించి దేశీయుల మన్ననలకుఁ బాత్రులై చిరకీర్తిని బడసిరి. కాని వీరి

దేశసేవానిరతి యెంత గాఢమైన దైనను తమ జీవితములో చాలభాగమ్ము స్వకార్యములయందే వినియోగపడ వలసి యుండుటచే, వీరు దేశమునకుఁ జేయఁగలిగినంత సాహాయ్యము చేయలేకపోయిరి. దినమంతయు స్వకార్యములందు వినియోగపఱిచి దినాంతమున నే యరగంటయో దేశహిత కార్యములందుఁ బనిచేయువా రగుటవలన వీరవలన నంతగ లాభము లేదు. స్వకార్యము లన్నియు విసర్జించి జీవితము నంతను దేశమునకొఱకర్పణముఁ జేయఁగలిగిన స్వార్థత్యాగులు కావలసిన కాల మాసన్నమైనది. మతవ్యాపనమున కెట్లు సన్న్యాసులును, భిక్షులును, తదేక దీక్షతో బనిసేయు చుందురో, యటులే రాజకీయజీవితముకూడ జీవనోత్సర్జనముచేఁ బవిత్రవంతముగఁ జేయఁగలుగు కార్యనిరతులకై దేశము వేచియున్నది. అట్టిస్వార్థత్యాగులను, దేశసేవాతత్పరులను, తయారుచేయుటయే యీ హిందూదేశ సేవకసంఘముయొక్క యుద్దేశ్యము. వలసరాజ్యములకుఁ గల స్వరాజ్యమువంటి పరిపాలనమును హిందూదేశమునకు' నంపాదించుటయే యీ నంఘమువారి గమ్యస్థానము. ఈ సంఘము వారు కేవలము రాజ్యాంగవిషయములయందే కాక సాంఘిక పారిశ్రామిక విషయములయందును, మఱియు దేశాభివృద్ధికి సహాయ మగు ప్రతి విషయమునందును, కృషి సలుపు చుందురు. తత్సంఘమున సభ్యుఁడుగా జేరువాఁడు గలాస్న

లేక పరీక్షయందుఁ (బి. యే.) కృతార్థుఁడై యుండవలెను. లేదా, విశేషప్రజ్ఞావంతుఁడై ప్రథమ సభ్యుని యభిప్రాయములో నట్టి పరీక్ష యనవసర మని తలంపఁబడిన వాఁడుగా నైన నుండవలయు. రాజ్యాంగాది విషయములలో శాస్త్రములం జదువుచు ప్రథమసభ్యునియొద్ద శిక్షనందుచు నైదు వత్సరములు పఠింపవలయును. సభ్యులుగఁ జేరువారు ప్రథమమున నేడు ప్రమాణములు సేయవలయును. అవి యేవన:—(1) దేశాభివృద్ధికరములగు విషయములనే తా నెల్లపుడు చింతనసేయుచుఁ దన సామర్థ్యములనెల్ల మాతృసేవకై వినియోగించెద ననియు (2) స్వవిషయ మగు వాంఛల నాసింపననియు (3) జాతిమతభేదము లేక యెల్లరఁ బ్రేమించి సోదరులనుగా భావించి వారల క్షేమమునకై కృషిసలుపుదు ననియు (4) సంఘమువారు తనకును దన కుటుంబమునకును బోషణార్థమై యొసంగఁగల ద్రవ్యముతోఁ దృప్తినొందుచు స్వలాభమునకై ధనము నార్జింపక దేశసేవఁ జేయుదుననియు (5) సత్ప్రవర్తనఁ గలిగి మెలంగుదుననియు (6) పరులతో స్వవిషయములగు పోరాటములు సలుపననియు (7) సర్వకాల సర్వావస్థలయందును సంఘముయొక్క యుద్దేశ్యములను, నభివృద్ధిని, గమనించుచు వాని సాఫల్యమునకై శక్తికొలఁది పాటుపడుచు, తద్వ్యతిరేకముగనుండు కార్యముల నేమియుఁ జేయననియు-ఇట్లు ప్రతిసభ్యుఁడు ప్రమాణముచేయును. వా

శేయే గ్రంథములు చదువవలసినదియు నే యే కార్యము లొనర్ప వలసినదియు ప్రధానసభ్యులుగ నుండువారు సభ్యుని సామర్థ్యముల ననుసరించి నిర్ణయింతురు. ఐదువత్సరముల శిక్ష ముగియువఱకు సభ్యుఁడెచ్చటను నుపన్యాసము లియ్యఁగూడదు. ఈ సంఘముయొక్క ప్రధానకార్యాలయము పునహానగరమున చతుశ్శృంగి యను కొండపైనున్నది. ఈసంఘ భవననిర్మాణమునకై సుమారు లక్షరూప్యములు వ్యయము చేయఁబడినది. అందు గొప్ప పుస్తకభాండాగారము కలదు. వివిధదేశముల యార్థిక రాజకీయ స్థితులం దెలుపు గ్రంథములును, లోకవిఖ్యాతిం గాంచిన మహనీయుల జీవితచరిత్రములును, ప్రభుత్వము వారి ప్రచురములును, మున్నగు ముఖ్యగ్రంథములన్నియు నా భాండాగారము నలంకరించియున్నవి. అందలి గ్రంథములు చాలభాగము హిందూదేశాభిమానియు నాంగ్లవంశజుఁడు నైన డిగ్బీదొరవారివి. వారియొద్దనుండి వాడియా యను దేశాభిమాని మూల్యమునకుఁ దీసికొని హిందూదేశ సేవకసంఘమునకు ధర్మముగా నొసంగెను. ఈ సంఘమునకుఁ బ్రతిసంవత్సరము సుమారు 25-వేల రూప్యములు వ్యయమగును. ఇపుడందు 26-మంది సభ్యులుగలరు. ఇదియే 1905-వ సంవత్సరము జూను నెల 12 తేది గోఖలేగారిచేస్థాపింపఁబడిన హిందూదేశ సేవకసంఘ సంగ్రహచరిత్ర. ఈ సంఘస్థాపనమునకై వారెటులు ద్రవ్యమార్జించినదియు,

పది వత్సరములనుండి నిర్విఘ్నముగ నీసంఘకార్యములు
జరుగుటకు గోఖలేగారెవరియొద్దనుండి చందాల వసూలు
చేయుచుండినదియు నెవ్వరికిఁ దెలియదు. అనఁగా వారి
యాంతరంగిక మిత్రులకు కొందఱకుఁ దెలిసియుండవచ్చునే
కాని యన్యులకుఁ దెలియదు. ఇటీవల వారు పరమపదించిన
పిమ్మట వార్తాపత్త్రికలలోఁ బ్రచురింపఁబడిన సంగతులంబట్టి
హిందూదేశములోని వివిధ రాష్ట్రములలోఁ గొందఱు ధని
కులు వారియం దభిమానము కలిగి ధారాళముగ నెల చం
దాల నిచ్చి సంఘమును బోషించుచున్నట్టు తెలియవచ్చు
చున్నది.

ఈ సంఘస్థాపనమునకై గోఖలేగారు ప్రథమమునం
దమ మిత్రులును శాంగ్లేవాస్తవ్యులునగు డాక్టరుదేవ్, అచ్యు
తరాం దేశాయిగార్ల కడకు వెళ్లి యాలోచించుచుండిరఁట.
ఈ సంఘము వారి హితోపదేశ ఫలితముగనే యుద్భవిల్లి
యుండవచ్చును. ఆకాలమున హిందూదేశమందు నూతనశక్తి
ప్రబలి స్వల్పవయస్కులగువా రుత్సాహపూరిత హృదయులై
కొందఱు తప్పుత్రోవలం బడుచుండిరి. వారిని సన్మార్గము
నకుఁ ద్రిప్పి వారి యుత్సాహముల నపాయరహితమగు త్రోవల
బోనిచ్చుటకును, వారిని రాజభక్తిపూరితులై మెలంగఁ
జేయుటకును, విధానముల గోఖలేగారు పెక్కుమారులు
గంటలకొలఁదిఁ దదేకచింతామగ్నులై యాలోచించుచుండిరి.

[illegible]ద కీ మహా సంఘమును స్థాపించి తానే యావజ్జీవము ప్రధానసభ్యుడుగానుండఁ దీర్మానించుకొని జీవితాంతమువఱకా పదవిని సామర్థ్యముతో నిర్వహించిరి. వారి యనంతరము మదరాసువాస్తవ్యులును మాననీయులు నగు వి. యస్. శ్రీనివాసశాస్త్రిగారా స్థానమున సంఘసభ్యులచే నియోగింపఁబడిరి. ఈ 1905-వ సంవత్సరములో గోఖలే గారొనర్చిన కార్యములు హిందూదేశ సేవక సంఘస్థాపనమే కాక మఱియు ననేకములున్నవి. హిందూదేశవిషయముల నింగ్లాండులోని పార్లమెంటు సభ్యులు మున్నగువారికిఁ దెలియుచుండుటకై యచ్చట ప్రచురింపఁ బడుచుండిన 'ఇండియా' యను పత్రిక సరియైన పోషణములేక నిలుపవలసినటులు తటస్థించఁగా, గోఖలేగారా పత్రికను నిలిపినయెడల హిందూదేశమును గూర్చి పార్లమెంటు సభ్యులు గాఢాంధకారమునఁ బడి వెక్కిలి తప్పుత్రోవలఁ ద్రొక్కుదు రని యెంచి, తాను ద్రవ్యమును గడించి పంపుదుననియు, పత్రికను నిలుపవలదనియు, పత్రికాధిపతుల కభయహస్త మిచ్చిరి. అంతట దేశాభిమానులం దర్శించియు నుత్తరములు వ్రాసియు ద్రవ్యమును సేకరించి పత్రికకుఁ బంపి దానిని పోషించిరి.

పై విధముగ నిండియా పత్రికకు ద్రవ్యము గడించుటయేకాక, పునహానగర వాసులు రాణడేగారిపేర నిర్మింపఁబడచిన "రాణడే వార్తాజ్ఞానబోధా ప్రతిష్ఠాపనము," (Ranade

Economic Institute) అనుభవనమునకై వారు ద్రవ్యమును సేకరింపవలసియుండెను. దానికై పాటుపడి సుమారు లక్ష రూప్యములను సంపాదించి, ఈ సంవత్సరమే దాని పనియును ప్రారంభించిరి.

ఆఱవ తరంగము

ఆంగ్లదేశయాత్ర

1904-వ సంవత్సరమున జరిగిన హిందూ దేశీయ మహాజన సభవారు తత్సభాభిప్రాయములను, ఇంగ్లాండులో నాంగ్లేయ మహాజనులకు బోధసేయుటకై కొందఱ హిందూ ప్రజానాయకుల నింగ్లాండునకుఁ బొండని ప్రార్థించిరి. ఆప్రార్థింపఁబడినవారలలో గోఖలేగారొకరు. స్వస్థానమునఁ దీరరాని పనియున్నను దేశసేవకై దీక్షనవలంబించిన యాదేశాభిమాని ప్రజల ప్రార్థన నంగీకరించి, ఇంగ్లాండునకు వెళ్లెను. అపుడు పంజాబుదేశము పక్షమున శ్రీయుత లాలాలజపతిరాయిగారు కూడ నింగ్లాండునకు వెళ్లిరి. ఇంగ్లాండులో గోఖలేగారు, ఆంగ్లేయప్రముఖుల దర్శించి హిందూదేశ విషయముల వారితోఁ జర్చించి, వారి దురభిప్రాయములను పాఱదోల యత్నించిరి. వారచ్చటనున్న 50 రోజులలో లేశమైనను విశ్రామము లేక పనిచేసి సుమారు 40 సభలలో నుపన్యా

నము లిచ్చిరి. కర్జన్ ప్రభువు గారి రాజప్రతినిధిత్వమున హిందూదేశ మెటుల అశాంతితోఁ గూడుకొనియున్నదియును, తత్ప్రభువుగారి దేశానిష్టకరములగు శాసనములను నుత్తరువులను, ఆంగ్లేయులకు బోధయగునటుల విపులముగా నుపన్యసించిరి. రాజమంత్రులం దర్శించి ప్రభుత్వమునందు జరుగవలసిన సంస్కరణలంగూర్చి చర్చించిరి. రాజమంత్రులును, హిందూదేశాభిమానులగు నాంగ్లేయ ప్రముఖులును, గోఖలేగారి వాక్యములను, హితోపదేశములను, మిక్కిలి యాదరణతో విని, కొందఱు మాత్రము తమ చేతనైనంతవఱకు వారికి సహాయ మొనర్చెదమనిరి. గోఖలేగారు హిందూదేశగమనోన్ముఖులైనపుడు, ఇంగ్లాండులో వారిపై నభిమానముగొన్న యాంగ్లేయప్రజలు గొప్పసభ జేసి వారిని గౌరవించిరి. హిందూదేశమునకు రాఁగానే బొంబాయి నగరవాసులు ఉచితవిధమున సన్మానించి తమ ప్రతినిధిగా నింగ్లాండుకు వెళ్లి వా రొనర్చిన కార్యములను స్తుతించుచు గోఖలేగారి నభినందించిరి.

కాశీ మహాజన సభాధిపత్యము

పై విధముగ నిరంతరపరిశ్రమ చేయుటవలన గోఖలేగారి కారోగ్యము తప్పెను. కొంచెమేనియు విరామములేక రేబవళ్లు కృషిసలుపుటవలన నెట్టి దృఢకాయునకైనను దేహారోగ్యము చెడును. ఇఁక మన గోఖలేగారన్ననో యంత శరీర

ధార్ఢ్యము కలవారుగారు. ఇంగ్లాండులో నొనర్చిన పనివలన గాత్రము చెడి హిందూదేశమునకు వచ్చునపుడు స్టీమరులో నొక చిన్నశస్త్రచికిత్స సైతము చేసికొనవలసివచ్చెను. అట్టి స్థితిలో నున్నవారికి హిందూదేశీయులు దేశీయమహాజన సభాధిపత్యము నొసంగిరి. భారతీయు లొసంగఁగల గౌరవ ములలో నీ సభాధిపత్య మత్యుత్తమమైనది. అట్టి గౌరవమును ప్రజ లొసంగఁగా వలదనఁ బ్రజల కేమియసంతృప్తి గలుగునో యను భయ మొకప్రక్కను, సభాధిపత్య మంగీకరించిన తన యప్పటి దేహస్థితిలో నాకార్యమును జయప్రదముగా నిర్వహింపఁగలనా యను సందేహ మొకప్రక్కను, గోఖలే గారిని బాధించెను. తుదకుఁ బ్రజాభిప్రాయమునకు వ్యతిరేకముగ నడువఁజాలక గోఖలేగారు సభాధిపత్య మంగీకరించిరి. ఈ సంవత్సరసభ కాశీపట్టణమున సమావేశ మాయెను. ప్రజలలో నూతనశక్తి యంకురించి యుండుటవలన, సభాదర్శములు, మార్గములు, మున్నగు వాని విషయమై భిన్నాభిప్రాయములు ప్రబలెను. వివిధాభిప్రాయములు గలవారిని సమాధానపఱిచి సభాగ్రాసనాధిపత్యమును నిర్వహించుట గోఖలేగారికి మిక్కిలి కష్టమాయెను. కాని తన శక్తికొలఁది నాభారమును సంస్తవనీయముగనే వహించిరి. గోఖలేగారు యగ్రాసనాధిపత్యోపన్యాసమున మిక్కిలి యవసర మగు పరిపాలనాసంస్కరణములం గూర్చి విపులముగఁ జర్చించి

కర్తవ్యనిర్ణయముం జేసిరి. ఈ సభ వారును మఱియొక పర్యాయము గోఖలేగారిని దమ ప్రతినిధిగా నింగ్లాండునకు వెళ్లుండని ప్రార్థించిరి.

ఇంగ్లాండునకుఁ బ్రయాణము

ప్రజాభిప్రాయము ననుసరించి మఱియొక పర్యాయము 1906 సంవత్సరమున గోఖలేగా రింగ్లాండునకు వెళ్లిరి. కర్జన్ ప్రభువుగారి పరిపాలనలోని ప్రజానిర్బంధన పద్ధతులవలనను, వంగదేశ విభజనవలనను, ఉన్నత విద్యావ్యాప్తి కాటంకములు కలిగించు విశ్వవిద్యాలయశాసనమువలనను, హిందూదేశమంతయు నాందోళనముతో నుడుకుచుండెను. కర్జన్ ప్రభుత్వ దుష్కార్యము లన్నిటిలో వంగదేశ విభజనము వంగదేశీయుల నాదఱనేగాక హిందూ దేశీయుల నందఱను రోషావేశపరవశులం జేసెను. వంగదేశీయ ప్రముఖులు విదేశవస్తు బహిష్కారమును బోధింప సమకట్టిరి. ఈవిధముగ దేశ మల్లకల్లోలముననుండ నీవత్సరమున ఏప్రెల్ నెల 14 తేదిన బారిసాలునగరమున సమావేశము కానుండిన వంగరాజధాని మహాసభ, యధికార దౌర్జన్యమున చెల్లాచెదరై పోయెను. అంతియగాక ప్రజానాయకులును దేశభక్తాగ్రేసరులలో నొకరును, అగు బాబు సురేంద్రనాథ బెనర్జీగారు మండలాధికారిచే పరిభవింపఁబడిరి; రాజధానిసభ నిలుపుదల చేయఁబడెను. ఈ యకార్యకరణమువలనఁ బ్రజల కోపానలము

ప్రజ్వరిల్లెను. తద్రాష్ట్రపాలకులుగ నుండిన ఫుల్లరుదొరవారు ప్రజలలో శాంతికలుగుటకు మార్గముల నాలోచింపక మరింత తీవ్రముగ నుండు ప్రజానిర్బంధనపద్ధతులనే యాచరణలోఁ బెట్టఁదలంచెను. గోఖలేగారింగ్లాండులోని ప్రజానాయకులకు హిందూదేశపు పై స్థితిగతులనెల్లఁ దెలియఁబఱచిరి. సెక్రటరీ ఆఫ్ స్టేట్ మున్నగువారిని దర్శించి, గోఖలేగారు హిందూదేశీయులలో నానాఁటికి వృద్ధియగుచున్న కలవరమును గూర్చి వివరముగఁ బలికి, ఫుల్లరుదొరవారిని నౌకరినుండి తొలఁగించి మఱియొకరి నా స్థానమున నియోగించినఁ గాని వారు పరిపాలన చేయుచుండిన భాగమునకు శాంతి యొనఁగూడ దనియు, ప్రజానిర్బంధనపద్ధతులఁ దొలఁగింపవలయు ననియు, హితోపదేశముఁ జేసిరి. తుదకు ఫుల్లరుదొరవారు నౌకరిచాలించుకొని స్వదేశమున కేఁగిరి; ప్రజానిర్బంధన పద్ధతులు కొన్ని మార్పఁబడెను, మఱికొన్ని సృష్టింపఁబడెను. కర్జన్ ప్రభువుగారి యనంతరము మింటో ప్రభువుగారు, తమ పరిపాలనమునఁ బ్రజల యభిప్రాయముల గమనించి నడచుకొనిన మంచిదని గ్రహించిరి. ఇండియా సెక్రటరీగారగు మార్లీప్రభువుగారు గోఖలేగారికి పలుమారు దర్శనమిచ్చి హిందూదేశీయు లభిలషించెడి రాజకీయ సంస్కరణములంగూర్చి వారితో చర్చించిరి. అచ్చటచ్చట సభలు గావించి వంగదేశవిభజనమును రద్దుపఱుపవలయు ననియు,

పరిపాలనలోఁ గొన్ని మార్పులఁ జేయవలయుననియు వారాంగ్లేయ ప్రజలకు బోధించిరి. ఈ విధముగ గోఖలేగారింగ్లాండులోఁ బరిశ్రమఁజేసి హిందూదేశీయ మహాజన సభకు సకాలములోఁ జేరవలయునని ఇంగ్లాండునుండి హిందూదేశమునకు వచ్చిరి.

కలకత్తా దేశీయమహాజనసభ

ఆ సంవత్సరపు సభ కలకత్తానగరమున శ్రీయుత దాదాభాయి నౌరోజిగారి యాజమాన్యమున సమావేశమాయెను. తత్సభలో గోఖలేగారు తా నింగ్లాండులో నొనర్చిన కార్యములం గూర్చియు, ఆంగ్లేయమహాజనులయొక్క ప్రవర్తనముం గూర్చియు, నుపన్యాసమిచ్చి, నమ్మకము విడనాడక యుక్తరీతి నిదేవిధముగ మనము కృషిసలుపుచుండిన మన యాదర్శములు కాలక్రమమున ఫలవంతములగునని సభవారికి నివేదించుకొనిరి. ఆ సభలో బహిష్కార నిశ్చయమును గురించియు, సభాదర్శములంగూర్చియు ప్రజాప్రతినిధులలో భిన్నాభిప్రాయములు కలిగి, సభకు భంగము కలుగునేమోయని కూడ కొందఱు భయపడిరి. కాని శ్రీయుత దాదాభాయిగారి యాజమాన్యమువలనను, గోఖలేగారి నేర్పువలనను, ఆ వత్సరమహాసభ జయప్రదముగ నెఱవేరెను.

ఉత్తరహిందూస్థాన సంచారము

మరుసటి సంవత్సరారంభమున గోఖలేగారు సం

యుక్త రాష్ట్రములలోను, పంజాబు దేశమునను, పనేక ముఖ్యపట్టణములలో సంచారముచేసి ప్రజలకు స్వదేశవస్తు ప్రోత్సాహమును గురించియు, హిందూమహమ్మదీయ సమ్మే ళనమును గురించియు, విద్యార్థుల ధర్మములను గురించియు నుపన్యసించిరి. మఱియుఁ బ్రజలకు జాతీయవాదులచే బో ధింపఁబడిన 'స్వరాజ్యము' 'బహిష్కారము' అను నాదర్శ ములంగూర్చి తన యభిప్రాయముల నొసంగి, జాతీయవాదుల వాదములను ఖండించిరి. ఈ పర్యటనములలో గోఖలేగారికి నా యా పట్టణవాసులొసగ్గిన గౌరవము రాజసన్మానము లతోఁ దులతూఁగుచుండెననిన నం దతిశయోక్తియే లేదు.

ఏడవ తరంగము

సూరతు మహాసభ

ఈ సంవత్సర దేశీయమహాజనసభ సూరతు పట్టణ మున సమావేశ మాయెను. వంగదేశీయ ప్రముఖులును సుప్రసిద్ధ న్యాయవాదులు నగు డాక్టరు రసవిహారిఘోస్‌గా రగ్రాసనాధిపత్యము వహించిరి. తత్సభలో నతివాదులకును మితవాదులకును గొన్ని తీర్మానములం గూర్చి యభిప్రాయ భేదము కలిగి, ఇరుపార్శ్వముల ప్రముఖులకును తీక్ష్ణములైన మాటలు నడచి, తుదకుఁ గల్లోలమై సభ చెల్లాచెదరై

పోయెను. మితవాదులలోఁ బ్రముఖులగు గోఖలేగారును, సర్ ఫిరోజిషా మెహతా మున్నగువారును మహాజనసభ నిలుపుదల యైనందుకు మిక్కిలి వగచి యికమీఁద నెన్నఁడు నట్టి యల్లకల్లోలము మహాజనసభలో జరుగకుండుటకై కట్టుదిట్టముల నేర్పఱుపవలయునని సంవిధానముల నాలోచించిరి. నిబంధనల నేర్పరుచుటకు మితవాదులలోఁ బ్రముఖులగువారు 1908-వ సం॥రం మార్చినెలలో, అలహాబాదు నగరమున, సమావేశమై సభోద్దేశ్యములను, నిబంధనలను, నిర్ణయించి, తన్నిర్ణయముల ననుసరించి సభలు జరుగునటులు నేర్పాటు చేసిరి. అదిమొదలు ప్రతి సంవత్సరము జరుగు దేశీయమహాజన సభ కగ్రాసనాధిష్ఠాత లేవారై యున్నను సభానిర్ణయాది కార్యక్రమ నిర్వర్తనమునకు గోఖలేగారే సూత్రధారులై యుండిరి.

ఇంగ్లాండు ప్రయాణము

అనంతరము గోఖలేగారింగ్లాండునకు వెళ్లిరి. ఇదివరలో వారింగ్లాండుకు వెళ్లినపుడు రాజమంత్రులను, ఆంగ్లేయ ప్రముఖులను దర్శించి, హిందూదేశమున కత్యావశ్యకమగు రాజకీయ సంస్కరణములం గూర్చి మాటాడి యుండిరి గదా. ఆ సంస్కరణములలోఁ గొన్నిటి నపుడు మార్లీ ప్రభువుగారు తలపెట్టియుండిరి. కాని వానిలోఁ గొన్ని హిందూదేశీయ ప్రముఖుల యిచ్ఛానుసారముగ లేవని గోఖలే

గారికిఁ దెలిపి వానిని మార్పించుటకును, మార్లీగారు తల పెట్టిన సంస్కరణముల నాంగ్లేయ ప్రజలు పార్లమెంటు మహాసభలో నంగీకరించునట్లు చేయుటకును, గోఖలేగారింగ్లాండులో గృషిచేసిరి. బొంబాయిరాష్ట్ర మహాజనసభవారి ప్రతినిధిగఁ దాఁగొనివచ్చిన యభిప్రాయములను ప్రభుత్వము వారికిని, ప్రజాప్రముఖులకును, నివేదించిరి. ఈ కార్యము లం జేయుచు గోఖలేగారాఱు మాసము లింగ్లాండులో సంచరించి డిసంబరు నెల 3 తేదిన స్వదేశగమనోన్ముఖులైరి.

మదరాసు మహాసభ

అలహాబాదులో నేర్పఱచిన నిబంధనల ననుసరించి 1908 వ సంవత్సరం డిసంబరు నెలలో మదరాసులో దేశీయ మహాజనసభ సమావేశమయ్యెను. నాఁటికి గోఖలేగారు మదరాసు నగరమునకు వెళ్లి, మహాసభలో నుపన్యాసము లిచ్చి, సభాకార్యముల జరపుటయందు తన్నగరవాసులకు సహాయులై సభయందు లోపము లేకుండ నెఱవేర్పించిరి.

1909-వ సం॥ నూతన సంస్కారములు

గోఖలేగారిటీవల రెండవపర్యాయము ఇంగ్లాండుకు వెళ్లి యచ్చట సాఫల్యమునకై ప్రయత్నించుచుండిన సంస్కరణములు 1909-వ సంవత్సరమందు మింటోమార్లీ ప్రభువుల యనుగ్రహమున శాసితములై మే నెల 25 తేదిన చక్రవర్తిగారి యంగీకారమును బడసినవి. వాని ననుసరించి ప్రతి

శాసననిర్మాణ సభలో దేశీయసభ్యుల సంఖ్య హెచ్చుచేయఁబడెను; ప్రజలు ప్రతినిధుల నెన్నుకొనుట కెక్కువ యవకాశము లియ్యఁబడెను; ఆదాయ వ్యయపట్టికను జర్చించు సమయమునఁ బ్రజాప్రతినిధులు ప్రభువులకు సలహాల నొసంగుటకుఁ గొంత యధికార మియ్యఁబడెను; పరిపాలనా విషయములలోఁ దీర్మానములను, బిల్లులను సభలోఁ బ్రవేశపెట్టుటకు, అనధికార సభ్యులకధికార మొసంగఁబడెను. మఱియు నిండియా సెక్రిటరీగారి సభలో నిద్దఱు హిందూదేశీయులను, రాష్ట్రకార్య నిర్వాహక సభలలో నొక హైందవుని, నియోగించుటకుఁ బ్రభుత్వమువా రంగీకరించిరి. ఇండియా సెక్రిటరీగారి సభలో సభ్యత్వమును వహింపుఁడని ప్రభుత్వోద్యోగీయులు గోఖలేగారిని గోరిరి; కాని వా రట్టి యపూర్వగౌరవమును దృణప్రాయముగ నెంచి వలదనిరి. తనకట్టి యుద్యోగము లనావశ్యకము లనియు, తన స్వార్థత్యాగవ్రతమునకును, దేశసేవకును నాటంకము లనియు, ప్రభుత్వమువారితో విన్నవించుకొనిరి. లోకమాన్యత నొంది స్వార్థత్యాగి యగు నీ మహనీయుని ప్రవర్తనముం బట్టిచూడ నిం దాశ్చర్యమేమియు లేదు. ఈయనజీవితమంతయు నిట్టి నిదర్శనములతో కదా నిండియున్నది!

నేటాలుకుఁ గూలీలఁ బట్టి పంపుట

1910 వ సంవత్సరమున శాసన నిర్మాణసభలో

గోఖలేగారు కొన్ని ముఖ్యములగు తీర్మానముల నుపపా దించిరి. అందులో మొదటిది, దక్షిణాఫ్రికాలో నా ప్రభుత్వమువారి క్రూరశాసనములవలన బాధలనందు భారతీయుల స్థితినిగురించి. అనేక సంవత్సరములనుండియు నీ విషయము హిందూదేశీయుల మనముల బాధించుచుండెను. కావున దక్షిణాఫ్రికాలో నొక రాష్ట్రమువా రగు నేటాలు దేశములోని భారతీయుల కష్టములైనను నంత్యము నొందును గాక యనితలంచి, గోఖలేగారు నేటాలుదేశమునకు హైందవ కష్టజీవుల నంపుట నాంపవలయు నని సామ్రాజ్యశాసన నిర్మాణ సభలో నొక తీర్మానము నుపపాదించిరి. ప్రభుత్వమువా రా తీర్మానము నంగీకరించిరి. 1911-వ సంవత్సరం జూలై 1 తేది నుండి దాని నాచరణలోఁ బెట్టిరి.

ప్రారంభవిద్య

రెండవది:—ప్రారంభవిద్యను గురించి. దేశమందంతటను ప్రజలు జ్ఞానవంతు లగుటకుఁ బ్రారంభవిద్యను బలాత్కారముగను ఉచితముగను గఱపుటకై, ప్రారంభించుటకు సమయ మాసన్నమైనదనియు, నా విషయమై నిబంధనల నేర్పఱిచి ప్రభుత్వము వారికి మనవిచేయ నధికారానధికార సభ్యుల కొందఱి నియోగింపవలయు ననియు, ప్రభుత్వము వారిని బ్రార్థించుచు నొక తీర్మానమును గోఖలేగా రుపపాదించిరి. సభ్యు లాతీర్మానమును బాగుగ జర్చించిరి. ప్రభుత్వ

డ్యోగీయులు దయాపూర్వక మగు ప్రత్యుత్తరము లిచ్చి తద్విషయమై యాలోచించెద మని చెప్పఁగా గోఖలేగారా తీర్మానమును వదలుకొనిరి. తీర్మానమును వదలుకొనినను యందలి యభిప్రాయములను దేశీయులకందఱకును బోధ చేయవలె ననియు, నంతియేగాక త్వరలో సామ్రాజ్యశాసన నిర్మాణసభలో నావిషయమును శాసనరూపకమగు బిల్లుగా ప్రవేశపెట్టవలయు ననియు వారు నిశ్చయించుకొనిరి. వివిధ రాష్ట్రములలోని ప్రజానాయకులతో నీవిషయమై యాలోచించి 1911-వ సంవత్సరమునఁ బ్రారంభవిద్యాశాసనమును సభలోఁ ప్రవేశపెట్టుట కనుజ్ఞ కోరిరి. సభవా రందుల కంగీకరించి బిల్లును రాష్ట్రపాలకులకును, ప్రజలకును, వారి వారి యభిప్రాయము లిచ్చుటకై పంపిరి. ప్రతివార్తాపత్రికలో నది ప్రకటింపఁబడెను. గోఖలేగారు, బిల్లును సభలోఁ బ్రవేశపెట్టిన పిమ్మట స్వయముగాఁ బ్రతిరాజధానియందుఁ గల ముఖ్యపట్టణములలో సంచారముచేసి, యాబిల్లును ప్రజలకుబోధించి, భిన్నాభిప్రాయముగలవారితోఁగలిసి చర్చించిరి; బిల్లునకు విరోధాభిప్రాయములనిచ్చు వారియూహాలు నిర్హేతుకము లని సభలలోఖండించి, శక్తికొలఁది లేశమేనియు కాలహరణముచేయక కృషి సలిపిరి. మఱియు హిందూదేశ సేవకసంఘ సభ్యులను వివిధపట్టణములకుఁ బంపి ఆయా పట్టణములలో సభలు జరిపించి బిల్లు నంగీకరించుచు

తీర్మానముల ప్రభుత్వము వారికి పంపునటులు చేసిరి. హిందూదేశములోని ప్రజాభిప్రాయమును వ్యక్తీకరించుటకై యీ విధముగ కృషిసలిపి, వారు ఇంగ్లాండులో నుండు బ్రిటిష్ ఇండియా సంఘసభ్యులకు నాంగ్లేయులకును బిల్లునకు సహాయమొనర్పవలయు నని యనేక లేఖలు వ్రాసిరి. అచ్చటి యాంగ్లేయ ప్రముఖు లనేకులు గోఖలేగారి బిల్లు నంగీకరించుచు తమసానుభూతిని దెలుపవలయు నని సెక్రటరీగారిని బ్రార్థించుచు నొక మహజరీని తయారుచేసి వారి ప్రతినిధులుగ కొందఱా మహజరీని ఇండియా మంత్రిగారి కర్పించిరి. ఈ విధముగ గోఖలేగారు నిరంతరపరిశ్రమఁ జేసిన ప్రారంభవిద్యావిషయకశాసనము 1912-వ సంవత్సరము మార్చినెల 18, 19 తేదులలోఁ జర్చకువచ్చెను. గోఖలేగారపుడు హిందూదేశముయొక్క యభిప్రాయమును సంగ్రహముగ ప్రభుత్వమువారికిఁ దెలియఁబఱిచి, బిల్లునకు వ్యతిరేకముగ నొసంగఁబడిన యభిప్రాయములకన్నిటికిని గ్రమముగాఁ బ్రత్యుత్తర మొసంగి యీ యంత్యోపదేశవాక్యములతో నుపసంహరించిరి. "ప్రాథమికవిద్యావ్యాపనమువలన దేశీయుల జీవితములం దెక్కువ యవకాశములు కలుగును. దేశీయుల సామాజిక, నైతిక, ఆర్థిక, విషయములలో నభివృద్ధికరములగు మార్పులను జేయుట కెక్కువ సులభ మగును. ప్రాథమికవిద్యావ్యాపనమువలన దేశీయులు ఋణదాతల యొత్తిడి

ష్టుండియు, పీడనముమండియు, తమ్ముఁ దాము రక్షించుకొనఁ గలుగుదురు. నా దేశీయులలో నూటికి 94 గు రజ్ఞానమున నుండ నారోగ్యముయొక్క ప్రయోజన మెట్లు గ్రహింపఁ బడును? 100 కి 94 గురికి చదువుటగాని వ్రాయుటగాని రానపుడు, మూఢవిశ్వాసములను నశింపఁజేయు టెట్లు? దేశములో జీవితాదర్శముల నుత్తమమైనవానిగఁ జేయుటెట్లు? 'నాహిందూ దేశ ప్రజల గృహములు జ్ఞానప్రసారము చేతను, జ్ఞానమువలన వచ్చు నుదారభావముల వలనను, సౌఖ్యము వలనను, తేజోవంతములై వారి జీవితము లానందకరములుగ నుండుగాక యని కోరుచున్నాను. అని శ్రీ రాజా చక్రవర్తిగారు కలకత్తా నగరమునఁ జెప్పిన వాక్యరత్నములకంటె నమూల్యమైనవి గానరావు. ఏవిధముగ జపానుదేశీయులు 1872 సంవత్సరములో వారి రాజుగారు చేసిన ప్రకటనను కృతజ్ఞతాపూర్వకముగ జ్ఞప్తియందుంచుకొనిరో, అదేవిధముగ జార్జి చక్రవర్తిగారియొక్క యమూల్య పదములను హిందూదేశీయులు సదా స్మరించునటులు దొరతనమువారు చేయుదురని మే మేల యాశపడఁ గూడదు? ఈదినము సభ ముగియులోపలనే, ఈబిల్లు నిరాకరింపఁబడునని నాకు తెలియును. కాని నేనేమియు విచారపడను. ఈ దేశములో నితరములవారు తమ యపజయముల వలననే దేశసేవ చేయవలసియుండు నని నే ననేకపర్యాయ

ములు చెప్పియుంటిని. జయములవలన సేవచేయఁ గలుగు నధికారము ముందుతరములవారిది. మనకు విధింపఁబడిన స్థితితో మనము తృప్తినొంది యుండవలెను. ఈబిల్లు ప్రస్తుతము నిరాకరింపఁబడినను, తిరిగి తిరిగి, ఈబిల్లే సభవారికి నివేదింపఁబడును. మా యపజయములను సోపానములపై నూతన శాసన మొకటి యుదయించి దేశమునంతయు జ్ఞానవంతముగఁ జేయఁగలుగునని నమ్ముచున్నాను. ఈ నమ్మకము నిష్ఫలము కావచ్చును. మా ప్రయత్నములన్నియు సముద్రతీరమునందలి ఇసుక తిన్నెలను దున్నినట్లే కావచ్చును. మా ప్రయత్నము లెట్లు పరిణమించినను మా ధర్మమును మేము నెఱవేర్చితిమి. ధర్మముకొఱకు ప్రయత్నము చేయకుండుటకంటెఁ బ్రయత్నముఁజేసి అపజయము నందుటయే యుక్తము." ఈధీరవాక్యములతో గోఖలేగా రుపన్యసించినపుడు సభాభవనమునందలి యందఱి హృదయములును కరఁగిపోయెను. గోఖలే గారెంత యుక్తియుక్తముగ నుపన్యసించినను, అధికారుల విరుద్ధాభిప్రాయముల కెన్ని సమాధానములు చెప్పినను దేశీయులనేకు లేకగ్రీవముగఁ బ్రారంభవిద్యావ్యాపనమును బలాత్కారముగ నొనర్పుఁడని కోరినను సభలో నుండు నధికారసభ్యులు బిల్లును నిరాకరింప వలయు ననెడి దృఢనిశ్చయముతో సభ కేతెంచియుండఁగాఁ [illegible] సాఫల్య మగుట కవకాశ మేమున్నది? అధికారసభ్యులే యెవ

నేల? అనధికారసభ్యు లగు స్వదేశీయులే కొందఱు గోఖలే గారి బిల్లునకు వ్యతిరేకముగ నభిప్రాయమిచ్చిరి. సభలో 18 మంది సభ్యులుమాత్రము బిల్లు నంగీకరించిరి. తక్కిన 38 మంది ప్రతికూలముగ నభిప్రాయమిచ్చిరి. తుదకు గోఖలేగా రనుకొనినట్లు బిల్లు త్రోసివేయఁబడెను. హిందూదేశము యొక్క దురదృష్టమున నా బిల్లు త్రోసివేయఁబడుటయేగాక, ఇంత శీఘ్రకాలములో గోఖలే మహనీయుఁడును బరమపద మందెను. ఇఁక నంత పట్టుదలతోడను, సామర్థ్యముతోడను నీ ప్రారంభ విద్యావ్యాప్తికై పోరాడఁగల ధీరుఁ డెప్పు డీ దేశ మునం దవతరించునో కదా!

ఎనిమిదవ తరంగము

ఇంగ్లాండు దక్షిణాఫ్రికాలలో సంచారము

పైనఁ జేర్కొనినబిల్లు త్రోసివేయఁబడిన తరువాత గోఖలేగా రింగ్లాండునకు వెళ్లవలసివచ్చెను. దక్షిణాఫ్రికా భారతీయుల కష్టములు నానాఁటికి మిక్కిలి ఘోర మగుచుండెను. భారతీయులసంఖ్యను దక్షిణాఫ్రికాలో వృద్ధి పొందుట కవకాశ మిచ్చుటవలనఁ దమ వ్యాపారమును హక్కులును నశించు నని బోయిర్లు భీతిల్లి పరిపాలనాధి కారము తమదై యుంటచే నిచ్చవచ్చినటులు క్రూరశాసన

ముల నమలులోఁ బెట్టిరి. ఈ యమానుష కృత్యములవలన భారతీయులు భయపడి స్వదేశములకు మరలిపోవుదు రని వారు తలఁచిరి. కాని, భారతీయులు తా మాంగ్లేయ సామ్రాజ్యమునం దెచ్చటికి వెళ్ళినను నాదేశీయులతో సమానమైన మానవ స్వామ్యములను బొంద సంపూర్ణాధికారము కలవారని దృఢపఱుప నిశ్చయించుకొనిరి. ఇంగ్లాండులో నుండు ప్రభుత్వోద్యోగీయు లీ విషయమై విధ్యుక్తధర్మములను జక్కఁగ నెఱవేర్పక కొంచె ముదాసీనభావమును వహించిరి. అట్టి తరుణమున దక్షిణాఫ్రికా భారతీయుల నాయకుఁడును, భారతీయ పుత్త్రరత్నము నగు శ్రీయుత మోహనదాసు కరంచంద్ గంధిగారు గోఖలేగారిని దక్షిణాఫ్రికాకు రావలయుననియు, తద్దేశ వాసుల కష్టముల స్వయముగా వీక్షింపవలయుననియు, కోరిరి. వారి యభీష్టము నీడేర్పవలయునని యెంచి గోఖలేగారు దక్షిణాఫ్రికాకుఁ బోవుటకు ముందుగా నింగ్లాండునకు వెళ్ళి యచ్చటి రాజమంత్రులతోడను, ప్రజాప్రముఖులతోడను, నీ విషయమై యాలోచించిరి. వారును గోఖలేగారిని దక్షిణాఫ్రికాకు వెళ్లి తద్రాష్ట్రమంత్రులతో స్వయముగా మాటాడిరండని బోధించిరి. గోఖలేగారు దక్షిణాఫ్రికాకుఁ బయనమగుటకు నిశ్చయించుకొని, బ్రిటిషు సంఘము వారి స్టీమరులో మొదటి తరగతి టిక్కెటు కొనుటకై వర్తమానమంపిరి. ఆ తరగతి

గదిలో నొక్కొక గదికి ఇద్దరు ప్రయాణికులు మాత్రమే యుండుట కేర్పాటుచేయఁబడియుండెను. హిందూ దేశీయుఁడగు గోఖలేగారొకతరగతి టిక్కెటుకొని యాగదిలో నొక స్థలము నాక్రమించుకొనిన, తెల్లవా రెవరును నాగదిలో నెక్కుటకు సమ్మతింపరనియు, ఆ గదికి నియమింపఁబడిన ఇద్దఱు ప్రయాణికుల మూల్యమునిచ్చినగాని టిక్కెటు నిచ్చుటకు వలనుగాదనియు, సంఘమువారు ప్రత్యుత్తరమిచ్చిరఁట. అంతట గోఖలేగారు భారతీయుల నంత హీనముగ బ్రిటిషు స్టీమరుసంఘమువా రెంచుట కేవలమన్యాయమని తత్సంఘాధికారులతోఁ బోరాడి తమ వాదమునఁ గెలిచిరి. జాతివైషమ్యము తెల్లవారిలో నెంతనాటుకొనియున్నదో గోఖలేగా రపుడు స్వానుభవముననే గమనించిరి. గోఖలేగారు దక్షిణాఫ్రికా దేశమును దర్శించుటకై వచ్చుచున్నారనియు, వారిని దగిన విధముగ సమ్మానింపవలయుననియు, ఆంగ్లేయమంత్రి పుంగవులు దక్షిణాఫ్రికాధికారులకు ముందుగ వర్తమాన మంపిరి. తదనుసరణముగ దక్షిణాఫ్రికాలోని రాజ్యాంగమువారును, మఱికొందఱు తెల్లవారును, గోఖలేగారి సంచారమున కెట్టి లోపముకలుగకుండ సౌకర్యముల నొసంగిరి. భారతీయులును వేనవేలు గుంపులుగుంపులుగావచ్చి, వారిని దర్శించి, సంభాషించి, తమ కష్టముల వారితోఁ జెప్పుకొనిరి. గోఖలేగారా దేశమున నాలుగువారములు సంచారముచేసిరి; మంత్రిపుం

గవులతో భారతీయుల కష్టములం గూర్చి చర్చించిరి; స్వదేశీయుల సభలలో నుపన్యాసములిచ్చి, హిందూదేశమున నున్న భారతీయులు తమ కష్టములను మరువలేదనియు, ధైర్యముతో మాతృదేశ గౌరవమును నిలుపుటకు జంకవలదనియు, వారలకు ధైర్యముం జెప్పిరి. అచ్చటిమంత్రులు కొందఱు భారతీయుల కష్టములం గొన్నిటిని త్వరలో నివారించెదమను నభిప్రాయములిచ్చు వాక్యములం బల్కినను, గోఖలేగారికి వారి మాటలయందంత విశ్వాసము కలుగలేదు. ఈ పర్యటనమునందంతయు శ్రీయుత గంధిగారు గోఖలేగారి కనుచరులై యుండిరి.

దక్షిణాఫ్రికా భారతీయులంగూర్చిన యుపన్యాసము

గోఖలేగారు దక్షిణాఫ్రికా యాత్రను సంపూర్ణము గావించి డిసంబరునెల 14 తేదిన బొంబాయి నగరమునకుం జేరిరి. అచ్చట బొంబాయి పురమందిరమున జరిగిన సభలో తాను దక్షిణాఫ్రికాలోం గని విని వచ్చిన సంగతులం జేర్కొని దీర్ఘోపన్యాసమిచ్చుచు నిట్లు సెప్పిరి:—"దక్షిణాఫ్రికాకుం బోయి యచ్చటి స్థితిగతులను స్వయముగం జూచివచ్చి నా యనుభవములను నా దేశీయులకును, ఇండియా గవర్నమెంటువారికిని, దెలుపుటకు నిశ్చయించుకొంటిని. దక్షిణాఫ్రికా దొరతనము వారు నన్ను గౌరవించుట యచ్చటి తక్కువ తరగతి తెల్లవారి కింతమాత్రము నిష్టములేదు.

కాని వారిలో పెద్దలును, ప్రముఖులును, నాకుఁ జేసిన గౌరవమునకుఁ జాలసంతసించిరి; భారతీయు లానందపరవశులైరి. నేను దక్షిణాఫ్రికాకుఁ బోవుటవలన మంచి జరుగకపోవచ్చును. కాని చెడుగుమాత్రము కలుగదని నా యాశయము. ఆఫ్రికాలో నిరువదిసంవత్సరముల నుండియు నున్న శ్రీయుత గంధిగారు నాకాంతరంగిక కార్యదర్శిగను, మార్గదర్శిగను, స్నేహితుఁడుగను, ఉపదేశకుఁడుగను నుండి నాకుఁ దోడ్పడెను. గంధిగారు మహానీయుఁడని యొప్పుకొనక తప్పదు. గంధిగారికిఁగల యాత్మప్రభను దాదాభాయినౌరోజి, మహాదేవ గోవిందరాణడే గార్లయందు మాత్రమే చూడఁగలిగితిని. భారతీయులకొఱకు గంధిగారు చూపిన స్వార్థత్యాగమతి శ్లాఘనీయము. అక్కడ గంధిగారు మిక్కిలి ప్రసిద్ధికెక్కిన బారిస్టరు గా నుండి సంవత్సరమునకు సుమారు 90 వేల రూప్యముల సంపాదించుచుండిరి. వారు తనసర్వస్వమును భారతీయులకై వినియోగించిరి; ద్రవ్యార్జన మాని, యెల్లభోగములను వదలి, నెలకు సుమారు 45 లు మాత్రమే వ్యయముగల జీవనమున కలవాటు చేసికొనిరి; తన కాలమునెల్ల స్వదేశీయుల బాధల నాపుటకై యత్నించుచు పడరాని పాట్లుపడిరి. అట్టి విరాగియగు గంధిగారి యాజమాన్యము క్రింద మనదేశీయులు ధైర్యస్థైర్యములతో దక్షిణాఫ్రికావారి క్రూరశాసనముల నిరోధించుచున్నారు. అప్పటి భారతీ

యులు నానాఁటికి హీనస్థితికి వచ్చుచున్నారు. ఒరెంజియా ప్రాంతమునం దున్న భారతీయు లందఱు తఱిమివేయఁబడిరి. దక్షిణాఫ్రికాలో మొత్తముమీఁద నొకలక్ష యేఁబదివేల మంది భారతీయులు గలరు. వీరిలోఁ జదువు వచ్చినవారు కొలఁది మందిమాత్రముగలరు. చాలమంది నియమములకు లోఁబడి కూలిచేయుటకు వచ్చినవారు. వీరు బానిసలకంటె నెక్కువ స్థితిలో లేరు. సరకులను దీసికొని ఇంటింటికిఁబోయి విక్రయించుకొను చిల్లర వర్తకులు కొన్నివేలసంఖ్య గలరు. వీరందఱు నచ్చటి చట్టములవలన జీవితము దుర్భరముగ నెంచుచున్నారు. బోయర్లు, ఆఫ్రికాలోని యాదిమనివాసులకును, భారతీయులకును, భేదమునుజూపరు. తక్కువ తరగతి తెల్లవారిలో నెక్కువ వర్ణద్వేషముగలదు. వీరుకూడ చిల్లర వర్తకు లగుటచే భారతీయులవలన వీరిస్వార్థమునకుఁ గొంత యాటంకము గలుగుచున్నది. ఐరోపావర్తకులకంటె భారతీయ వర్తకులు వస్తువులఁ జౌకఁగ నమ్ముటచే వీరి కిరువురకు పోటీపడినది. భారతీయవర్తకు లేటేటను క్రొత్తగా వర్తకమునకు ననుజ్ఞాపత్త్రములను (లైసెన్సులను) దీసికొనవలెను. ప్రతిసంవత్సరము కొందఱి యనుజ్ఞాపత్త్రములు నిర్హేతుకముగ రద్దుచేయఁబడును. ఇది చాల కఠినముగ నెంచఁబడుచున్నది. ఈ కారణముచే నీ వర్తకులలో దుష్టవర్తనము వృద్ధియగుచున్నది. లైసెన్సుల నిచ్చు యధికారము తక్కువ

తరగతుల ఐరోపియనులకుఁ గలదు. వీరికిని, భారతీయులలో వర్తకము చేయువారికిని, పోటీ యుండుటచే వీరి లైసెన్సులు తఱచుగ రద్దు చేయఁబడుచుండును. ఈ విషయమును దక్షిణాఫ్రికా దొరతనము వారికి నివేదించితిని. నేటాల్ దొరతనమువారు హిందూదేశీయులకు తల 1-కి రు 45 లు పన్నును విధించిరి. 13 సంవత్సరముల హిందూ బాలిక యీ పన్ను చెల్లించనియెడల 6 మాసములు ఖైదు ననుభవింపవలసినదే. ఈ కఠిన శాసనములవలన భారతీయు లక్కడ నుండుటకుఁ గష్టమగుచున్నది. ఈ దుర్భర మగు పన్నువలన వేలకొలఁది భారతీయులు నిరాధారు లగుటయే గాక పురుషులు దొంగతనమునకును, స్త్రీలు వ్యభిచారమునకును, పాల్పడుచున్నా రని నేటాల్ దొరతనమువారి మంత్రి నాతోఁ జెప్పెను. నే నుపన్యసించిన సభలలో నొకదానికి 5000 మంది భారతీయులు వచ్చియుండిరి. వారు తమ కష్టములనుగూర్చి నాతోఁ జెప్పిరి. తలపన్ని య్య లేకపోవుటచేత 6 పర్యాయములు కారాగృహమునకుఁ దాఁ బోవలసివచ్చెనని 65 సంవత్సరముల వృద్ధస్త్రీ యొకతె సభలోఁ జెప్పెను. భారతీయులు నీచస్థితియందు నివసింపవలసివచ్చినది. వారి పిల్లలకుఁ జదువు లేదు; కేవల మజ్ఞానములోఁ బెరుగుచున్నారు. ఒక భారతీయుఁ డొక సంవత్సరము సెలవు పుచ్చుకొని హిందూదేశమునకు వచ్చి తిరిగి పరిమితకాలమున కొకరోజు

తప్పి యాలస్యముగ నాఫ్రికాకుఁ బోయెను. తుపానువలన సముద్రముపై నాలుగురోజులు నిలువవలసి వచ్చె నని చెప్పి నను దక్షిణాఫ్రికాలో వానిని దిగనియ్యక యచ్చటి యుద్యోగీయులు వానిని మరలహిందూదేశమునకుఁ బంపివేసిరి. వానికి నెటాలులోఁగలవ్యాపారమంతయునష్టమయ్యెను. అచ్చటిదొరతనమువా రొనర్చుచున్న యక్రమకార్యము లిట్టివియనేకములు గలవు...బ్రిటిషు పౌరత్వమనునది యథార్థముగ నందులేదు. మనదేశమునందు మన కెక్కువ హక్కులు వచ్చినప్పుడే మనము సామ్రాజ్యమునందును నెక్కువ హక్కులను సంపాదింపఁగలుగుదుము. ఈ విషయముల నన్నిటి నచ్చటి దొరతనమువారితో వివరముగఁ జెప్పితిని. ఏమంత్రియైనను నచ్చటి భారతీయులను గౌరవముగఁ జూచినచో నామంత్రి నొక్కదినమైనను బ్రతుకనియ్యరు. ఈవిషయములో సామ్రాజ్యప్రభుత్వమువా రేమియును జేయఁజాలరు. ఎవరయిన నేమియిన జేయఁగలిగినచో దక్షిణాఫ్రికాలోని ఐరోపియనులు కొంతచేయఁగలరు. అచ్చటిఐరోపియను ప్రముఖులు భారతీయుల స్థితిని గొంతవఱకు సంస్కరింప వలెనని యున్నారు కాని వారును బూర్తిగఁజేయజాలరు. ఈ స్థితినంతయు గంధిగారు గమనించిరి. గంధిగారు తాను ధీరుఁడగుటయేగాక, 2700 మంది విద్యరాని చిల్లరవర్తకులనుగూడ ధీరులను జేయఁగలిగెను. వీరందఱును నచ్చటి కఠిన శాసనములకు

లోఁబడక కారాగృహములను జొచ్చిరి. నాప్రయత్నముల
వలన నేటాలుప్రభుత్వమువారు తల 1 కి రు 45 ల పన్నును
తీసివేయనున్నారు. ఇంకను గొన్ని బాధలు నివారణ కాను
న్నవి. కాని లైసెన్సుల విషయ మింకను తేలలేదు. ఈ పోరా
టము తీవ్రముగ జరిగినఁ గాని యిది నివారణ కాఁజాలదు.
రాఁబోవు సంవత్సరములో ని పర్యవసాన మేదోవిధముగఁ
దేలును. అచ్చటిభారతీయుల పిల్లలకు విద్యనొసంగుట కేర్పా
టులు చేసెదమని దొరతనమువారు వాగ్దానము చేసిరి. విద్యా
భివృద్ధి యైనకొలఁదిని దక్షిణాఫ్రికా శాసన నిర్మాణ సభలో
భారతీయులు సభ్యులుగ నుండుటకుఁ దగిన దినములు రావ
చ్చును. మన మందఱము వారిపక్షము నవలంబింపవలయును.
మన మింతవఱకు వారికిఁ దగిన సాయముచేసి యుండలేదు.
దక్షిణాఫ్రికాసమస్య మూలముననే సామ్రాజ్యములో మన
కుఁగల హక్కులు నిర్ణయమగును. దీనికొఱకు మనము చాల
ధనమును సమకూర్చి పట్టుదలతోఁ బోరాడినఁ గాని మన
కార్యము సిద్ధింపనేరదు.”

తొమ్మిదవ తరంగము

రాయల్ కమీషన్

గోఖలేగారు దక్షిణాఫ్రికాయం దుండఁగనే హిందూ దేశ పరిపాలనమందు దేశీయుల నెక్కువగ నియోగించుటకు మార్గముల నాలోచించుటకై యొక రాయల్ కమీషను చక్రవర్తిగా రేర్పాటుచేసిరి. ఆసభయందు గోఖలేగా రొక సభ్యులుగ నియమింపఁబడిరి. సభ్యులలో నెక్కువమంది యాంగ్లేయులు. హిందూదేశీయుల సంఖ్య యత్యల్పము. అయినను గోఖలేగారు ఆ సభయందు నియమింపఁబడుట దేశీయులకుఁ గొంతవఱకు సంతోషముగ నుండెను.

ఈ సభ్యత్వమును గోఖలేగా రంగీకరించుటయందు వారి స్వార్థత్యాగ వ్రతమునకు మరియొక నిదర్శన మేర్పడెను. వారు సామ్రాజ్యశాసననిర్మాణ సభాసభ్యులుగ నున్నందు వలన, రాయల్ కమీషనులో సభ్యులై తత్సభ్యత్వమునకు నియమితమైన రు 1500 ల మాసపారితోషికమును బుచ్చుకొనవలనుగా దనియు, రెంటిలో నొక దానిని వదలుకొనవలయుననియుఁ బ్రభుత్వమువారు వారినిగోరిరి. గోఖలేగారు ప్రజాసేవయే ముఖ్యమని యెంచినవారుగాని ద్రవ్యార్జనకై యీసభ్యత్వముల నంగీకరించినవారు కారు. వారు సామ్రాజ్య

శాసన నిర్మాణసభయందేమి, రాయలు కమీషనునందేమి తాను సభ్యుఁడై తన శక్తి సామర్థ్యముల నుపయోగించి ప్రజలకుఁ దానేమి మేలుసేయఁగలుగునో యందులకై కృషిసలుపుటకు సభ్యత్వపదవుల నంగీకరించినవారని ప్రజలకుఁ దెలియును. కాఁబట్టి యట్టి సందర్భములలోఁ దాను మాసపారితోషికమునైన వదలుకొందునుగాని ప్రజాసేవను వదలనని నిశ్చయించుకొని, రాయల్ కమిషనులోని సభ్యత్వమునకై నెలకుఁ బ్రభుత్వము వారిచ్చెదమనిన రు 1500 లును తృణప్రాయముగా భావించి వలదనిరి.

రాయల్ కమీషన్ సభ్యులు

1913-వ సంవత్సరము జనవరి నెల 3 తేదిన మదరాసునందు సాక్ష్యవిచారణము ప్రారంభించిరి. కొన్ని మాసములిచ్చట విచారించి, సభ్యులింగ్లాండునకు వెళ్లిరి. గోఖలేగారును సభ్యత్వకార్యముల నిర్వహింప నింగ్లాండునకు వెళ్లి హిందూదేశమునకు మరల సెప్టెంబరు నెలలోవచ్చిరి.

దక్షిణాఫ్రికాలో సాత్విక నిరోధోద్యమమునకు సహాయము

ఈ సంవత్సరమే దక్షిణాఫ్రికాలో మరల సాత్విక నిరోధోద్యమము భారతీయులచేఁ బ్రారంభింపఁబడెను. గోఖలేగారితో దక్షిణాఫ్రికాప్రభుత్వము వారు మార్చెదమని చెప్పిన క్రూరశాసనములను మార్పక భారతీయులను మునుపటివలెనే హింసింప మొదలిడిరి. తిరుగఁబాఱిన హైందవుల

దక్షిణాఫ్రికాలోని యధికారులు ఖైదులలోనుంచుటయేగాక గుఱ్ఱపు కొరడాలతోఁ గొట్టియుఁ గాల్చి చంపియు, కూలి వారిని నానావిధముల హింసించియు, ననేక ఘోరకృత్యముల పాలుసేసిరి. విషాదకరములు నమానుషములునగు వారి యకృత్యములన్నియు భరతఖండవాసుల శ్రోత్రపుటములకు ములుకులవలె సోఁకి యొక్కొక్కని హృదయాంతరాళము నుండి దుఃఖమును క్రోధమును పరంపరలుగాఁ బ్రజ్వరిల్లఁ జేసెను. గోఖలేగారికిని దమతో దక్షిణాఫ్రికా మంత్రులు చెప్పిన మాటలన్నియు వ్యర్థము లయ్యెఁగదా యని దుఃఖము కలిగెను. అయినను వారు లేశమైన నధైర్యముఁ జెందక, గాంధి మహాశయున కభయ హస్తమిచ్చి, భారతీయుల కష్టములు నివారణ మగువఱకు సాత్విక నిరోధోద్యమమును జరుపుటకుఁ గావలసిన ద్రవ్యమును హిందూదేశీయులు పంపుటకు సిద్ధముగ నున్నారని తెలియఁబఱిచిరి. గోఖలేగారును, హిందూదేశ సేవక సంఘసభ్యులును, హిందూదేశమంతయు సంచారముచేసి వేలువేలు ద్రవ్యమును సంపాదించి గాంధిగారికిఁ బంపిరి. గోఖలేగారు ద్రవ్యమును బంపుటయేగాక హిందూదేశ రాజప్రతినిధిగారిని సైతము దర్శించి ఈ దక్షిణాఫ్రికాసమస్యవిషయమై వారితో సంభాషించిరి. కాలక్రమమున నీ సమస్య కొన్ని విషయములలో భారతీయులకుఁ దృప్తికరముగాఁ దీర్మానింపఁబడెను.

ఇంగ్లాండునకుఁ గడపటి ప్రయాణము

గోఖలేగారికి దేహస్థితి యిప్పటికే జబ్బుగా నుండెను. హిందూదేశీయుల నందఱ సోదరులుగా భావించుకొని, వారి కష్టములు తన కష్టములుగా నెంచి నిరంతరము దేశహితము నకై కృషిచేయుటవలన వారి దేహారోగ్యము చెడినది. ఈ మధ్య నింగ్లాండునకు వెళ్లినపుడు విచ్చియను గ్రామమునకు బలుమారు వెళ్లుచు నచ్చట దేహస్వస్థతను గాంచుచుండిరి. ఈ సంవత్సరము (1914) మరల నింగ్లాండునకు వెళ్లిరి. రాయల్ కమీషను వారు, ఇంగ్లాండులో సాక్ష్యవిచారణ మును జేయుటకును, ఇదివరలో విచారించిన సాక్ష్యము యొక్క సారాంశమును జర్చించి తమ యభిప్రాయముల లిఖిత రూపముగఁ జక్రవర్తిగారికిఁ దెలుపుటకును, మే నెల 4 తేదిన సమావేశము కావలయు నని నిశ్చయించుకొనిరి.

గోఖలేగారంతకుఁ బూర్వమే ఇంగ్లాండునకు వెళ్లి, ఏప్రెల్ నెల 28 తేదిన లండను నగరమునుండి విచ్చి గ్రామమునకుఁ బోయినను, దేహస్వస్థత లేనందున సరియైనకాలము నకుఁ గమీషనువారినికలియఁజాలక, మే నెల 20 తేదికి లండను జేరి వారిని కలసికొనిరి. గోఖలేగారచ్చట నున్నను వారిని జూచుటకై యనేకులు ప్రముఖులు ప్రతిదినము వచ్చుచునే యుండిరి. విచ్చినుండి లండను నగరమునకుఁ జేరుటకు మురిదు మధ్య, ట్వికెనుహాములో గోఖలేగారు దేశబాంధవు

లగు రత్న తాతా దంపతులం దర్శించిరి. వారు గోఖలేగారి కాతిథ్యము నొసంగి తమ ప్రశాంతకుటీరమున వారికి నివాసమేర్పఱిచిరి. అచ్చట నుండఁగా ననేకు లాంగ్లేయులు వారిం దర్శించి హిందూదేశవిషయముల ముచ్చటించిరి. గోఖలేగారు లండను జేరి కొంత కాలము రాయల్ కమీషను మెంబరులఁ గలసి యాసభావిషయములు చర్చించిరి. కాని, హిందూదేశీయుల దురదృష్ట వశమున గోఖలేగారు లిఖిత రూపమున వారియభిప్రాయములు ప్రభువుగారికి నివేదించు భాగ్యము లేకపోయెను. గోఖలేగారి కారోగ్యము చక్కఁగా లేనందున హిందూదేశమునకు, అక్టోబరు నెల 24 తేదినఁ బయనమైరి. వారు మరల నింగ్లాండునకుఁద్వరలో వెళ్లి సభ్యు లందఱు కలసి నివేదనపత్త్రిమును (రిపోర్టు) వ్రాయఁదలంచిరి. కాని దైవనియోగము నెవరెఱుంగఁగలరు ?

కాంగ్రెసు రాజీ

హిందూదేశమునకు వచ్చినప్పటినుండియు గోఖలేగారు జబ్బుగానే యుండిరి. ఇంత యనారోగ్యస్థితిలో నుండియు దేశవిషయమైన సంగతుల నాలోచించుటయు, వానిం గూర్చి యాయాస పడుటయు నామహనీయుఁడు వదలఁడాయెను. అన్నిటికంటె నెక్కువగ నీకాలమునందు వారిని బాధించినది దేశీయమహాజనసభావిషయమైన యుభయవాద సామరస్యప్రయత్నము. 1907-వ సంవత్సరమున సూరతు వద్ద

ణమున దేశీయమహాజన సభ చెల్లాచెదరై పోయినది మొదలు దేశీయులలో నతివాదులనియు, మితవాదులనియు రెండు తెగ లేర్పడుటయు, అతివాదులలో ననేకులు 1908 వ సంవత్సరమునుండి నేఁటివఱకు జరిగిన దేశీయమహాజన సభలలో నైక్యము కలిగించుకొనక కొన్ని విషయములఁ గూర్చి పోరాడుచుండుటయు నందఱెఱింగిన యంశములే. ఈ యిరుపార్శ్వముల వారికిని రాజీకుదుర్పవలయునని యనేకసంవత్సరములనుండి యత్నములు జరుగుచున్నను కార్యసాఫల్యము కాకుండెను. అతివాదుల పక్షమును దేశభక్తులగు బాలగంగాధర తిలక్, మోతీలాల్ ఘోష్, మున్నగువారును, మితవాదుల పక్షమును సర్ ఫిరోజషా మెహతా, గోఖలే మున్నగువారును చేరి, రాజీసంగతులు పత్రికలలోను, ఉత్తరములమూలమునను జర్చించుచుండిరి. అనిబిసెంటమ్మగారు మధ్యవర్తినిగాఁ గొంత కార్యకలాపము నడపిరి. 1914 వ సం॥ డిసెంబరు మాసాంతమున మదరాసులో జరిగిన దేశీయమహాజనసభయం దీవిషయమును బహిష్కారము సేయఁదలంచిరి. కాని యది విఫలమాయెను. శ్రీయుత తిలక్, గోఖలేగార్లం గూర్చి పత్రికలలో ననేకసంగతులు ప్రకటింపఁబడెను. అందులోఁ గొన్ని యసత్యము లగుటవలన గోఖలేగారి మనస్సు వ్యాకులతనొంది సత్యమును లోకమునకుఁ బ్రకటింపవలయునని గోఖలేగారు పత్రికలకుఁ గొన్ని యుత్తరముల వ్రాసిరి.

శ్రీయుతతిలక్ గారును బ్రత్యుత్తరములిచ్చిరి. ఈ వివాదములు మిక్కిలి యనారోగ్యమందున్న గోఖలేగారి మనశ్శాంతికి భంగకరము లయ్యెను.

పదియవ తరంగము

అనారోగ్యము, అంత్యదశ

గోఖలేగారు హిందూదేశము చేరినది మొదలు వైద్యుల యధీనముననే యున్నను వివిధ దేశములనుండి స్నేహితులు వ్రాయు నుత్తరములకు బ్రత్యుత్తరమిచ్చుటయందును, తమ్ము సందర్శించుటకై వచ్చు మహాజనులతో సంభాషించుటయందును, విశేషకాలమును గడపుచుండిరి. జీవితప్రారంభము నుండియు వారు విధ్యుక్తధర్మముల నిర్వహించుటయందే మనస్సు నిలిపియుండిరి కాని తమయారోగ్యమును గమనించి దాని కనుగుణముగ వర్తించినవారు కారు. వారు ఫెర్గూసన్ కళాశాలలోనుపాధ్యాయులుగానుండినపుడు పలుమారు రాత్రి పెద్దప్రొద్దువఱకు మేల్కొని కార్యముల నెఱవేర్చుచుండిరట. మఱియు 1897 వ సంవత్సరమున గోఖలేగారికి సంభవించిన యొక విపత్తు వారి యారోగ్యమును చెడగొట్టె నని నైతము చెప్పుచున్నారు. దానివిషయమై దేశభక్తుండగు వాచాగా

రిట్లు చెప్పిరి. "మేము లండను వెళ్లుచుండఁగా స్టీమరు కాలే రేవునొద్దకు వెళ్లునప్పటికి గోఖలేగారికి దెబ్బతగిలెను. గోఖలేగారు గదిబయట నిలిచియుండిరి. ఎవరో తటాలున గదితలుపును నెట్టిరి. తలుపు గోఖలేగారిగుండెకుఁ దగిలెను. బాధపడుచుండియు, మాకు నాతురత గలుగు నని రెండురోజులవఱకు గోఖలేగారు తమబాధను నాకుఁగాని దాదాభాయిగారికిఁగాని చెప్పలేదు. మేమప్పుడు దాదాభాయిగారియింటనే బసచేసితిమి. మూఁడవనాఁడు బాధభరించుటకు శక్యముగాక నాతో చెప్పెను. నేను వెంటనే వైద్యునిఁ దీసికొనివచ్చితిని. 'ఇది చంపవలసిన దెబ్బ. అదృష్టమువలనఁ దప్పినది' అని వైద్యుఁడుచెప్పెను. మాకుఁ జాలభయముకలిగినది. 'భయములేదు, సారమైన యాహారమొసఁగిన నయమగు'నని వైద్యుఁడు చెప్పెను. గోఖలేగారు ప్రక్కమీఁద నటునిటుఁ బొర్ల లేక పోయిరి. 17 సంవత్సరములక్రిందటఁ దగిలిన యీ దెబ్బయే యీయనను, అప్పటినుండి బాధించుచున్నదని నా నమ్మకము." నిజముగా ఇది వారియారోగ్యము చెడుటకొక కారణమై యుండవచ్చును. మఱియు వారి కతిమూత్రవ్యాధి సంభవించెను. దానివలన వారు మిక్కిలి బాధపడుచుండిరి. ఎన్ని యౌషధములనో సేవించిరిగాని ఫలము లేక పోయెను. సరియైన విశ్రాంతి నొందుఁడని వారి స్నేహితులుపదేశము సేయుచుండిరి. కాని వారా హితోపదేశము

నాదరించినను నాచరించుటకు దేశహితైకతత్పరత యడ్డు చుండెను. ఇంగ్లాండులో నుండిన ఆరోగ్యము బాగుగనుండు నని యెంచి విశేషకాల మింగ్లాండులో నుండిరి. కాని హిందూదేశమునకు రాఁగానే మరల యథా పూర్వస్థితి గల్గు చుండెను. గతసంవత్సర మింగ్లాండులో నుండగాఁ జాల జబ్బుచేసి, వారెట్టకేలకు స్వదేశముసం జేరవలయు నని యత్నించి పునహానగరముఁ జేరిరి. ఈ సంవత్సరము (1915) ఫిబ్రవరినెలలో గంధి మహాశయుఁడు బొంబాయి నగరముం జేరునని వినఁగనే గోఖలేగారు మిక్కిలి సంతోషించి, జబ్బుతో నున్నను బొంబాయి నగరమునకు వెళ్లి గంధి దంపతులకు స్వాగత మియ్యవలయు నను నుత్సాహముచే నచ్చటకు వెళ్లిరి. గంధిదంపతుల పునహానగరమునకు దోడ్కొనివచ్చి, ఆనెల 13 వ తేదిన నొక విందుఁజేసిరి. గోఖలేగారి కప్పటికే హృదయదౌర్బల్యముతోఁ గూడిన యుబ్బసపువ్యాధి సంప్రాప్తమైయుండెను. ఆ విందు దివసమున వారు కొంతకాలము స్మృతి లేకయుండిరి. వైద్యు లుపచారముసేయఁగా మరల స్మృతివచ్చెను. కాని వైద్యులును మిక్కిలి భయపడిరి. శుక్రవారము నాఁడిదిజరిగెను. తర్వాత బుధవారము, గురువారము వఱకును వ్యాధి యొకప్పుడు కొంచెము తగ్గుచు, మఱియొకప్పుడు కొంచెము హెచ్చుచు నుండెను. శుక్రవారము ప్రాతఃకాలముననే మరల గోఖలేగారికిఁ గొంచెము స్మృతి

తప్పెను; వ్యాధి వృద్ధియయ్యెను. గోఖలేగారప్పటికి తన యవసానకాలము సమీపించినదని గ్రహించిరి. తన స్నేహితులను, బంధువులను దగ్గఱకుఁబిలిచి తాను చెప్పవలసిన మాటలను జెప్పిరి. తన సోదరిని, కుమార్తెలను, సమీపమునకు రండని గృహకార్యవిషయములంగూర్చి వారికిఁజెప్పిరి. హిందూదేశసేవక సంఘసభ్యులతో నాసంఘవిషయమై కొన్ని విషయములం జెప్పిరి. 9 గంటలపుడు తన సమీపమున నున్న యొకరితోఁ 'ప్రపంచవిషయములను నింతవఱ కనుభవించితిని; ఇఁకఁ బరలోక విషయములం జూతము' అని గోఖలే మహానుభావుఁడు నుడివెనఁట. బంధుమిత్రులెల్లరు వారి సమీపమునఁజేరి మిక్కిలి దుఃఖించుచుండిరి. పునహానగరవాసులు గుంపులు గుంపులుగా వారు నివసించిన హిందూదేశ సేవకసంఘ భవనమున సమావేశమైరి. శ్రీయుత గోపాలకృష్ణ మహాశయుఁడు నాఁటిరాత్రి 1915 సం॥ ఫిబ్రవరి నెల 19 తేది) 11-10 గంటలకు భారతీయులను శోకవార్ధియందుఁ బడద్రోసి పరలోకమునకేఁగెను.

ఈ దుఃఖవార్తను దేశదేశములలో నివసించుచున్న ప్రతి బాలుఁడును, వృద్ధుఁడును స్త్రీయును, పురుషుఁడును, హైందవుఁడును, మహమ్మదీయుఁడును, - ఇంతేల, వయో జాతి మతభేదము లేక యెల్లరుశోకించిరి. పునహానగర సమీపముననున్న పల్లెలనుండియు, రైలువలన సరియైన కాలము

నకు రాఁదగిన పట్టణముల నుండియు, గోఖలేగారి యంత్య దర్శనమునకై యనేకులు వచ్చిరి.

గోఖలేగారి యన్నకుమారుఁడు దహనాది క్రియల నొనర్చెను. పౌరులకోరిక ననుసరించి శవవాహకులు గోఖలే గారి కళేబరమును ప్రధానరాజ మార్గములలోన గొంపో యిరి. సుమారు 20 లేక 30 వేలమంది ప్రజలు శవమువెంట శ్మశానవాటికం జేరిరి. అంత ప్రజ పునహానగరమునం దెవ్వ డును గుమికూడ లేదనియు, గోఖలేగారిపై ననురాగమును నపూర్వగౌరవమును సూచించుటకీ ప్రజయే నిదర్శనమని యు, పౌరు లనుకొనిరి.

అభిమానుల సానుభూతి

గోఖలేగారి మరణవార్త శ్రీరాజా చక్రవర్తిగారికి తెలి యఁగా శ్రీవారు దేశభక్తుని మరణమునకుఁ జింతిల్లుచు తమ సానుభూతిని తెలుపు వర్తమానముచు గోఖలేగారి కుటుంబ మునకుఁ బంపిరి. రాజప్రతినిధిగారగు హార్డింజి ప్రభువర్యు లును మిక్కిలి చింతిల్లిరి. అనేకులు ప్రార్లమెంటు సభ్యులును తమ సానుభూతులఁ దెలుపుచు నుత్తరములఁ బత్రికలలోఁ ప్రచురించిరి. (పార్లమెంటు) ఆంగ్ల రాజ్యాంగ మహాసభలో క్రూప్రభువు కర్జన్ ప్రభువుగార్లు గోఖలే గారింగూర్చి ముచ్చ టించి వారి మరణము వలన సామ్రాజ్యమునకు సంభవించిన నష్టమునకుఁ జింతిల్లిరి. విదేశీయులే యిట్లు చింతింపఁగా నిఁక స్వదేశీయులం గూర్చి చెప్పవలసినదేది లేదు. హిందూ దేశ మందలి ప్రతి పట్టణమునను, గ్రామమునను ప్రజలు గుంపులు

గుణీపులుగాఁ గూడి గోఖలేగారి మరణ విషయమై చింతిల్లిరి. అనేక పట్టణములలో వారి పేర జ్ఞాపక ప్రతిష్ఠాపనముల నేర్పఱుపఁ బ్రజలు తీర్మానించుకొనిరి. అనేక పట్టణములలో ప్రభుత్వ కార్యాలయములు గౌరవార్థముగ మూయఁబడినవి. ఇంతేల! గోఖలేగారి మరణవార్తవిని ప్రభువులును, ప్రజలును జూపిన దుఃఖమును, గౌరవమును, మఱియే దేశ భక్తునకు నింతవఱకు వారలు జూపి యుండ లేదనుట యెంతయు నిక్కము. అట్టి యపూర్వ గౌరవమునకు గోఖలేగారి స్వార్థ త్యాగము, నిష్కల్మష జీవితము అదాంభిక ప్రవర్తనము, ముఖ్యకారణములు. కె. సి. ఐ. ఇ. యను గొప్ప బిరుదము నొసంగుదుమని సెక్రటరీ ఆఫ్ స్టేటుగారు గోఖలేగారికి వ్రాయఁగా వలదని వారొసఁగిన ప్రత్యుత్తరము వారి యదాంభికత్వమును మఱింత ప్రకాశింపఁ జేయు చున్నది. నిజమైన దేశసేవ యన నిట్టిది యని లోకమునకు నిరుపమానముగ నిరూపింపఁజాలిన రాజ్యకార్యధురంధరుఁడు శ్రీయుత గోపాల కృష్ణ గోఖలేగారే యనఁదగు.

సంఘ సంస్కరణము

సంఘసంస్కరణ విషయములలో గోఖలేగారు తద్వ్యాపనమునకై కృషిసలుపక పోయినను, జీవితమున నాచరణమున వారు సంస్కర్తలై యుండిరి. ప్రభుత్వాధికారులయొద్ద సంస్కర్తవలె నటించి యస్వస్థలములలోఁ బ్రాచీనాచార పరాయణులై మెలంగుట వారెఱుంగరు. సత్యమని వారు తలంచిన సంస్కరణములనన్నిటి నాచరణమునం బెట్టిరి.

ఒక్కసమయమున, పునహా నగరమునందు సంస్కరణ మవలంబించిన కొందఱు ప్రాయశ్చిత్తము చేసికొనవలసి నటులు తటస్థింపఁగా, గోఖలేగారట్టి భీరువులకు ధైర్యముగొల్పి 'మనః పూర్వకముగ మీరు సత్యమని నమ్మి యాచరించిన దానికి నిరర్థక ప్రాయశ్చిత్తమేల? ప్రాచీనాచారపరాయణులు మిమ్ము బాధలఁబెట్టఁ దలచిన వానిని ధైర్యంబుతో భరించి కార్యసాఫల్య మొందవలయునే గాని సత్యముం గోల్పోవుట ధర్మమా?' యని బోధించి ప్రాయశ్చిత్తము పాలుగాకుండ వారిని నివారించిరి. మూఢాచారముల నిర్మూల మొనర్ప నెవ్వరైన యువకు లుత్సాహముతో ముం దంజవేయ యత్నించిన నట్టి వారిం జూచి గోఖలేగారు సంతోషించి తమ శక్తి కొలఁది సహాయ మొనర్చుచుండిరి.

కుటుంబము

గోఖలేగారికి ఇర్వురు పుత్రికలు గలరు. పెద్ద కుమార్తె ఫెర్గూసన్ కళాశాలలో బి. ఏ. పరీక్షకు చదువుచున్నది. వారి కింకను వివాహము కాలేదు. గోఖలేగారి సతీతిలకము సుమారు 14 సంవత్సరముల క్రిందటనే యకాల మరణము నొందెను. నాఁటినుండియు గోఖలేగారు మరల పరిణయమాడక, తుచ్ఛభోగములను, స్వప్రయోజనములను త్యజించి, జీవితమంతయు దేశసేవకై యర్పించి ధన్యులైరి. దైవము దేశభక్త గోపాలకృష్ణ గోఖలేగారియాత్మకు శాంతి నొసఁగుఁగాక!

అనుబంధము

ప్రశంసా సూక్తిముక్తావళి

హార్డింజి ప్రభువుగారు

ఫిబ్రవరి నెల తే 23-దిన సమావేశమైన సామ్రాజ్య శాసన నిర్మాణ సభలో శ్రీరాజప్రతినిధి గారిట్లు ప్రశంసించిరి:

"ఈ సభలో సభ్యులగు గోఖలేగారు 19-తేది రాత్రి యకాల మరణమునకుఁ బాల్పడిరను దుఃఖవార్త నాకు 20-తేది యుదయమునఁ దెలియవచ్చి నన్నుఁ జింతాసాగరమున ముంచినది......దేశకార్య నిర్వహణ మందు నుత్సాహ పూరితమగు కార్యదీక్షయు, సమానమగు యుక్తాయుక్త విచక్షణా సామర్థ్యమును గలిగియుండుటచే దేశీయులగు ప్రజానాయకులలో గోఖలేగారు సర్వజన పూజితమగు స్థానము నాక్రమింపఁ గలిగిరి. గోఖలేగారు బ్రిటిషు ప్రభుత్వమునం దత్యంత రాజభక్తి భరితులు; కాని ప్రభుత్వమువారి పరిపాలనా విధానమును, భావమును, దెక్కుసారులు నిర్భయముగ విమర్శించియుండిరి. మరియు నుపాలంభనమున కెడముగలిగి నట్టియుఁ దమ యభిప్రాయమున నక్రమమని తోఁచినట్టియు, ప్రతిశాసనమును గూర్చియు ప్రభుత్వము వారికి నిర్భయముగ తమ భావమును వెల్లడించుట కాయన యెన్నడును వెనుదీయలేదు. ముఖ్యముగ నార్థికవిద్యా విషయములయందాయనవాద మత్యంత తీక్ష్ణమును నమోఘమును నై యుండుటచే

వందుల సుచితరీతిని సమాధాన మొసంగుటయుఁ బూర్వపక్షులు చాలభ్రమ పడవలసి వచ్చుచుండెను...గోఖలేగారికిని నాకును గల వ్యవహార సంబంధములయం దన్నిటను గూడ గోఖలే గారి కాపవసఖ్యులని మాత్రమే గాక వారు నా కత్యంత ప్రియమిత్రులని గూడ నేను భావించుచుంటిని. ఆయన నాకు పెక్కుసారులు హితోపదేశ మొనరించెను. ఆ యుపదేశములు సోపపత్తికములును, యుక్తియుక్తములుఁ గూడనని నేను గ్రహింపఁగలిగి తిని. దక్షిణాఫ్రికా నివాస ప్రశ్నమునుగూర్చి యత్యధిక రాజభక్తి భరిత మును ననుకూల ప్రదమునగు సాహాయ్యము నాకాయన యొసర్చెను. గోఖలే గారికి కె. సి. ఐ. ఇ. బిరుదము నొసంగఁదగునని శ్రీ జార్జిచక్రవర్తి గారికి నేను విన్నవించి యూరకు మాసమునైన కాలేదు. కాని సహజ వినయ స్వభావ భావుకులగు గోఖలేగారా సూచనయందలి సద్భావమును మాత్రము గ్రహించి బిరుదము నంగీకరింప నొల్లరైరి. అట్టి మహనీయుఁడు మనల నెడఁబాసి పోయెను. నిజముగ నాయన స్థానము నాక్రమింపఁ గలవారు దొరకుట చాల నసంభవమనియే నుడువ వచ్చును........."

ii

సర్ ఫిరోజిషా మెహతా

"ఆ మహనీయునిగూర్చి మహోపన్యాస మొనర్పవలెనను తలంపు నా మానసమున నంతర్వాహినియై పోయినది. గోఖలే గారి జీవితమును గూర్చియు దేశసేవను గూర్చియు నే నెఱిఁగిన దంతయును చెప్పుట కెంత కాలమైనను చాలదు....అతనిగూర్చి యుపన్యాసము లేల? ఈ మహాసభ యును దేశమందెల్లెడలను జరుగు మహాసభలే యాలోకమాన్యుని కీర్తిని ముల్లోకముల సుచితరీతిని జాటుచున్నవి. నేనిపుడు మాటలాడ వలెనన్నను మాటలాడఁ దగినస్థితిలో లేను. వార్ధక్య మలయించుచున్న తతి న క్షీణ శాక్తిని జేసి నా సహచరులొక్కరొక్కరుగ నన్ను విడచిపోవుచున్నారు. రానడే గారు, తిలాంగుగారు, బదరుద్దీన్ గారు మున్నగు మిత్రులందఱును నను బాసి

పోయిన కతంబున నామానసము సంతాప పదనమై నిరుత్సాహతనుం జెంది యున్న కారణమున నే నుపన్యసింప నసమర్థుఁడను. మహనీయులారా! మాపరస్పర సంప్రీతిని, ఒండొరులకుఁగల గౌరవాదరములను, మీ కెఱిఁగింప నాకు మాటలు దొరలకున్నవి. నే నెట్లు సుబోధ్యముగాఁ జేయ నోపుదు? ఆయనను గుఱించి మహాప్రయత్నముతో ముచ్చటింపఁ బూనినపుడు, 'అయ్యో! గోఖలే! పోతివా?' యనుమాటయే నా వాగ్వశమగుచున్నది. అతని సాహాయ్యము, సాంగత్యము ధురీణత్వము లేక, మే మేర్పఱిచికొనిన సంవిధానముల నాచరణీయములుగా నెట్లు సేయ నగునో, నాకే గోచరింప కున్నది. ఆయననుగూర్చి మరేమియు ప్రస్తుతము నుడువఁజాలను గాని ఆగాఖానుగారని నట్లు 'అతఁడు మహాపురుషుఁడు' అని మాత్రము నుడువఁగలను."

iii

హీజ్ హైనెస్ ది ఆగా ఖాన్‌గారు

"గోఖలేగారు సామాన్య రాజ్యతంత్ర ప్రవీణుఁడు మాత్రమే కాదు; మేధాశక్తిని సృజింపఁగల చతురుఁడగు చిత్రకళాభిజ్ఞుఁడు. ఆయన యుపన్యాసవైఖరి, కళాకలితమగు పదసమ్మేళనము. పదలాలిత్యమునచే గాక కార్యనిరూపణము నందును, కార్యాచరణమునందును గూడ నాయన కళాకౌశలము విదితమగుచుండును. మఱియు నాకళా కౌశల్య మభివృద్ధి నొందించుకొనుట కాయన నిరంతర మన్వేషించుచు నట్టి సౌకర్యము లెచట లభించునని తోఁచిన నచటికెల్ల నేగుట కే మాత్రము వెనుదీయు వాఁడు గాఁడు......నా కా మాన్యునిగూర్చి యెంత చెప్పినను జెప్పిన దంతయును బహు స్వల్పమనియే దోఁచుచుండును. ఆయన రాజ్యాంగ కోవిదులలో నగ్రగణ్యుఁడు; వక్తలలో నుత్తముఁడు. దేశభక్తులలో నాయకమణి. ఆయన ప్రవర్తనమును లెస్సగ నెఱింగినవారి కాయన సాధు వర్తనులలో సచ్చరిత్రులలో నద్వితీయుఁడు. ఆయన కేవలము దైవభక్తుఁడు. దైవభక్తియే

ర్గాయనకు మూలబలముగాని ఆయన భక్తి లోకవిడంబన సాధనములగు మూఢాచారములచే భూయిష్ఠము గాదు. అది రాజస తామసాదులను దాటిన పరిశుద్ధ సాత్త్వికభక్తి. ఆయన సంఘసంస్కరణ విషయమున నధికముగఁ బనిచేయలేదని కొందఱందురు. అందునను గూడ స్వాయన చేసినదాని నాచరణ పూర్వకముగనే చేసియున్నాఁడు. అలహాబాదులో హిందూ మహమ్మదీయ సమస్యనుగూర్చి చర్చింపుఁడని ఆయనను గోరఁగా నందులకాయన తిరస్కరించెను. 'నేను హిందూ మహమ్మదీయ మత భేదములను బరిత్యజించితిని. నేను హిందువునుగాను, మహమ్మదీయుఁడనుగాను, భారతీయుఁడను' అని ఆయన నుడివెను. దేశభక్తుఁడై సంస్కర్త కాకుండుట యసంభవము. సంస్కరణోద్యమ సారమిదియే. దానినే గోఖలేగారా చరణవలనఁ జూపిరి. ముఖ్యవిషయ మాయన యుదార ప్రేమ. ప్రేమస్వరూపుఁడగు నాయన పరిసరమునఁ గొద్దికాల ముండఁగలిగిన వారిలో కూడఁ దమ యారోగ్యమునఁ గొంతభాగ మాయనకు ధారపోయఁజాలక పోతిమిగదా యని చింతిల్లనివారు కానంబడరు."

iv

బాబు సురేంద్రనాథ బెనర్జీగారు

"ఈ మహాదేశమంతయు శోకదేవతా వృతమైయున్నది. ఒక మహారాజు, ఒక మహానీయుఁడు భూశయ్య నొరిగెను. హిందూదేశమునఁ బ్రస్తుత కాలమున రాజకీయ ప్రపంచమును సుప్రకాశ మొనర్చుచున్న మహావిగ్రహ మంతర్ధానమైనది. హిందూదేశ స్వాతంత్ర్యములకొఱకుఁ దీవ్రముగ వాదించు సంరక్షకుఁడు మధ్యవయస్సుననే యపహరింపఁబడెను. ఇతనికి 'రాజర్షి' యను నామము సార్థకముగ వర్తించును. 25 సంవత్సరములనుండి నేనీయనతోఁ బరిచయము గలుగు భాగ్యమును బొందియుంటిని. ఇంతకన్న సత్యప్రియుఁడు, ఉదారభావుఁడు, శాంతిధనుఁడు నా కెక్కడను దారసిల్లలేదు.............ప్రజా కార్యపరతంత్రులగు దేశీయులలో నింతటి సత్క

ప్రియులు, కార్యదక్షులు, స్వార్థత్యాగులు, నగు పురుష రత్నములందుట యపూర్వము......రాజ్యాంగ దక్షుఁడును మహర్షియు మనలకు కాని పోయెను. ఈమహా సంఘ మంతయును దుఃఖసాగరమున మునిఁగియున్నది..."

v

న్యాయమూర్తి టి. సదాశివయ్యర్ గారు

"...గడచిన ఇరువదియైదు సంవత్సరముల నుండి మేధావంతులును, శీలవంతులు నగువారు చాలమంది సామర్థ్యముతో హిందూదేశాభివృద్ధికిఁ బాటుపడుచున్నారు. అందఱికంటెను గోఖలేగా రధికు లని చెప్పిన మిగిలినవారి నగౌరవించినట్లుండదు. హిందూదేశాభివృద్ధికై పాటుపడుచున్న వారందఱికంటెను నున్నతస్థానము నాక్రమించుకొనఁగలిగిన ప్రత్యేక సత్తా గోఖలేగారియం దుండినది. వీరందఱి నతిశయించినారు. వీరి మరణమువలనఁ గలిగినలోపమును బూర్తిసేయుటకు మరియొకరికిఁ జాలకాలముపట్టును.... వీరితో స్నేహముసేయు భాగ్యము నాకుఁ గలిగినది. వీరు దేశాభిమానులకంటెను, రాజతంత్రజ్ఞులకంటెను గొప్పవారు. వీరు బాలురవలె నిగర్వులు. ఇతరులను వారు నమ్మిరి. ఇతరులు వారిని నమ్మిరి. గోఖలేవంటివారిని ఇప్పటిలో మరియొకరిని జూచుట దుర్లభము."

vi

డి. ఇ. వాచాగారు

"ఈయన ప్రవర్తనమందంతటను నమ్రతయే సువ్యక్తమగుచుండెను. ఆ నమ్రత యత్యంత ప్రశంసనీయముగ నుండెను. జ్ఞానము నానాఁటి కతిశయించును గాని వినయము స్థిరావాస మొనర్చునని టెన్నిసన్ కవి యొచటనో నుడివిన విషయమును గోఖలేగా రనుకరించుచున్నారా యను నట్లాయనకు జ్ఞానము లోకానుభవమును హెచ్చినకొలందిని నమ్రతకూడ సుస్థిరమగుచుండెను. ......గోఖలేగారికి దైవభక్తి మెండు. తత్కారణమున పెద్దలయందు భక్తికూడ నధికము...సత్యము, సాధుశీలము, నిరహంకార

మ్ము, నిరంభూషాయము మున్నగు సద్గుణముల కాయన యాటపట్టనదగును....
అయ్యన ప్రవర్తనము నిష్కళంక మని నేను ఖండితముగ నుడువఁగలను. వేమ
నగారు నుడివినట్లు గోఖలేగారు కేవల నిర్మలజీవన మను వృక్షమునఁ
బూచిన శ్వేత కుసుమరాజము ననుకరించుచున్నారు. గృహస్థధర్మమున
గోఖలేగారు సాధుస్వభావుఁడును, ఏకపత్నీవ్రతుఁడగు భర్త, పుత్రవాత్స
ల్యభరితుఁడగు జనకుఁడును, పరమ మిత్రుఁడు నై యుండెను. ఒక చీమఁ
గొట్టి వేఱొక చీమ నొసఁగునంతటి పరమసాధుస్వభావుఁ డనియును నేను
నుడువుటకు సంశయింపను. ”

vii

మహారాటా

“జామదగ్న్య శిష్యుఁడగు శాంతనవుఁడు నిజగురునిగూడ నతిశ
యించిన చందమున రానడే గారెన్నుకొనిన శిష్యులగు గోఖలేగారు రాన
డేగారినిగూడ మించిరని రానడేగారి యాత్మకూడ నొప్పుకొనుననియే మాకు
విశ్వాసము మెండు. రాజ్యాంగ విషయములందు గోఖలేగారొక్కరే సర్వ
భారత ప్రజానాయకు లని నిర్ధారణ చేయఁబడి పది సంవత్సరము లైనది.
ఆస్థానమునువారు ఉత్తమరీతిని నిలుపుకొనఁ గలిగిరి. గోఖలేగారట్టి మహో
న్నత స్థానమునఁ బ్రతికూల మారుత సంచార భీకర సమయములందుఁగూడ
నిశ్చలముగ నిలిచియుండఁ గలిగిరి. ఆయన యశోభాగము గగనభాగమున
గురుతర ప్రకాశభాసురమై నిరంతరము వెలుఁగొందఁ గలదు. ”

viii

ఆంధ్రపత్రిక

“గోఖలేగారు భారతమాత పుత్రులలో నగ్రగణ్యుఁడు. భారతమాత
పుత్రులలో మహారాజులు శ్రీమంతులు విద్యావంతులు రాజనీతిజ్ఞులు గలరు
కాని గోఖలేగారి పేరువలె మూలమూలలను వ్యాపించిన పవిత్రమైన నామము
వేఱొకటి లేదని నిస్సంశయముగఁ జెప్పవచ్చును... ఈ తరమున మన దేశ

మునందు గోఖలే సదృశుఁడైన మహాపురుషుఁడు వేఱొకఁడు గలడని యూహించుటకైనను శక్యముకాని దుస్థితియందు మన దేశమున్నదని మనము గ్రహించినప్పుడు లోకమాన్యుఁడును లోకప్రియుఁడును నైన గోఖలేగారి యకాలమరణమువలన హైందవుల హృదయంబులందుఁ బొంగిపారలెడి దుఃఖమునకు మితి మేరలు నిర్ణయించుట యసాధ్యము. ఉచ్ఛస్థితియందుండియును సాధుశీలమును, శాంత స్వభావమును, నిష్కపట స్వభావమును, నిర్మల చారిత్రమును గలిగి, దేశహితార్థమై తమజీవితమును నర్పించిన శ్రీ గోపాలకృష్ణ గోఖలేగారి పవిత్ర జీవితము దేశారాధన పరాయణుల కాదర్శముగ ముండుఁగాక!"

vix
కృష్ణాపత్రిక

"మతము కొఱకు నెంత త్యాగమో చేసినవారిని జూచినాము. కుటుంబమును రాజ్యమును వదలిన వారిని జూచినాము. కేవలము విరాగులై పంచాగ్ని మధ్యమునఁ దపస్సుఁ జేసిన వారిని జూచినాము. కాని రాజ్యాంగము కొఱకు సర్వ సంగత్యాగముఁ జేసిన వారిని, ఇంతవఱకుఁ గాంచలేదు. రాజ్యాంగ మైహికవిషయమని మనవారి యభిప్రాయము. ఐహికము కొఱకు సర్వసంగత్యాగ మేమిటియని ప్రశ్న. మత మెంతపవిత్రమైనదో, ముముక్షుత్వ మెంత యుత్కృష్టమైనదో, రాజ్యాంగము కూడ నంత పవిత్రమైనది అంత యుత్కృష్టమైనది అని చూపించినవారిలో గోఖలే మొదటి వాఁడు, అగ్రగణ్యుఁడు. సర్వసంగత్యాగముతోఁ బనిచేసిన వారికి రాజ్యాంగముకూడ మోక్షసాధకమే. గోఖలే నిజమైన సన్న్యాసి, యథార్థమైన విరాగి. సాధారణముగ సన్న్యాసులు తమమోక్షము కొఱకుఁ బాటుపడుదురు. కాని గోఖలే తనమోక్షముకొఱకుఁ బ్రయత్నింపలేదు. మాతృదేశముయొక్క మోక్షములోనే తనమోక్షము గలదని గ్రహించినాఁడు. గోఖలే మహానీయుఁడు ముక్తిమార్గములోఁగూడ స్వార్థమును విడనాడినాఁడు. నిష్కళంకమైన విరాగి గోపాలకృష్ణ గోఖలే యని నిస్సంశయముగఁ జెప్పవచ్చును."

పద్యములు

(శ్రీయుత చావలీ వేంకటకృష్ణయ్యగారు)

మ. అరరే! పాపపుదైవమిట్లు పగమాహ్వాయంబుఁ గావించెనే
యురుశౌర్యాదివిభూతిభాస్వరుని; విద్యోద్దీప్తు; నాలోచనా
పరు; నాత్మీయవిచారదూరగుని; దీవ్యద్దేశ భక్తు న్నన్నతున్
బరలోకంబునఁ జేర్పఁ గ్రూరముగ విశ్వశ్రేష్ఠు గోఖ్లేమణిన్

శా. అన్నా! చిన్నటనాఁడె వీడిచనె నీయర్ధాంగి; నిన్నార్చు వా
రెన్నో చందములన్ ద్వితీయమును నీకేర్పాటు గావింపఁగా
మన్నన్ ‘భారతమాత సేవక మహోద్యోగంబు నాకుండ నే
యన్నంగూడ’ దటంచుఁ, బల్కితివి తండ్రీ! నీకు నేరీసముల్?

శా. ధీయుల్ సన్నుత దేశసేవకులఁ సాధింపంగ యత్నించి నా
నారాటంబుల దేశమాతృహిత కార్యానీకమున్సల్పెన్నా; అ
వ్యార్జ్గాడి రొనయ్య సత్కృతులు నవ్యారింగసంగీర్తనన్
నేరంగాలవు త్వత్కృతాత్మ ధరణీశేఖర ప్రక్రియన్.

శా. ఆచార్యాయ నమోనమో యనుచు విద్యార్థుల్ ప్రశంసింప; బు
ద్ధీ చాతుర్యయుటంచు నాంగ్లహితు లర్థింగొల్వ; మాగోఖలే
ప్రాచీనం బగు ధర్మరూపుని సంభావింపఁగా దేశముల్,
నీచాయల్పొగడొందఁ గారితిటు ప్రాప్తింపఁగ సామాన్యమే?

మ. నినుసగ్గింపఁ దెరక్ష నంతటి ఘనుండే ‘గోఖలేతోడ నా
సనవార్తల్గంబునఁగల్గు నాహానములుచైప్ప నోడదమున్నావుఁగా
ర్చు’నటంచాడె; యటేనుతింపఁగద గంధీయుండు మిన్ప్రభుం
డును; లోకంబునవిట్టిసద్ఘనత నెందున్ గాంచిరే ధీనిధుల్.

శా. నీరూపాకారము నీదుపోకయు మఱి నీస్నేయు త్తరీయంబుః హా
హా!యీతండగు హైందవుండని మహాహ్లాదంబుఁగల్పించు న
న్నా!యెవ్వారిటులార్య చిహ్నముల బాయంజాలకున్నారు? ని
న్నే యన్నింటి నుదాహరింపవలెఁ గాయీసద్గుణోరాశికిన్

ఉ. పట్టపరీక్షయందుఁ దినబాలుని యీడున నీ జయంబుఁ దాఁ
గట్టి స్వదేశ సేవలకుఁ గాలము సంగడన్ ప్రతిజ్ఞఁ జేఁ
బట్టి స్వకీయమున్ మఱచి ప్రాణములాయువు నాత్మసర్వమున్
గొట్టన దేశమాతపద నీరజమందునఁ బెట్టినట్టి నీ
దిట్టతనంబులోకమునఁ దేజరిలున్ ప్రళయంబుదాఁకనున్.

ఉ. పంచమవేదమందుఁ దెలుపంబడెఁగృష్ణమహాత్త్వమెల్లఁ బ్రా
పంచిక పూరుషుండెవఁడు భారతకృష్ణుని బోలువాఁడటం
చెంచెడి యాత్మశంకలవి యీకలినీవు జనించుహేతునన్
గాంచఁగనుండెనంతము; నకాలపుమృత్యువుగల్గెనింతలో!

ఉ. ఏరికి నప్పగించితివొ యీభరతావనిమాత నిష్ఠ? నీ
భారము పూనఁగాఁదగిన ప్రాజ్ఞులు నీదుసహోదరాదు లె
వ్వాగలులేనిచో జననిప్రాణము లేగతినిల్చునయ్య? వేఁ
జేరుపుమయ్య యొక్కరిఁ గృశించెడితల్లి నిప్రోవఁగన్నవన్.

ఉ. ఈవొనరించినట్టి కృషియెల్లను నీశకృపావిశేష మే
దోవిధమందు సత్ఫలమునొందునటుల్ పొనరించుచుండి యీ
జీవులదృష్టి నేయుచుఁబ్రసిద్ధికిఁదెచ్చును హైందవోర్విఁ; దై
నీవున ధన్యతంగనుచు వేదియుఁగోరము లేకయుండెడిన్.

(శ్రీయుత మయిలవరపు వేంకటరామయ్యగారు)

ఉ. భారతవర్ష వాసుల తపఃపరిపాకఫలోత్తముండు, వి
స్తారమనః ప్రబోధనుఁడు, శక్యదుదారగుణాకరుం, డపా
ధారణశక్తి సంపదనిధానుఁ డటంచు జగంబు గోఖలేన్
భోరని సంస్తుతింపఁగొనిపోతివి నైపక్రూరదైవమా!

సీ. భారతప్రముఖ శిరోరత్న మనఁజాలు రాజ్యతంత్రజ్ఞుఁడై ప్రబలె నెవఁడు
ప్రభువులకును బ్రజాప్రతతులకును నేక పరణిఁ బ్రీతిం గొల్పఁజాలె నెవఁడు
ప్రతిపక్షులకు నైన మతిగౌరవముఁ గల్గఁ జర్చలు సల్పంగ నేర్చె నెవఁడు
వాదు వీడక నిర్భయముగా భారతీయుల యున్నతికిఁ బోరఁ గలిగె నెవఁడు

తే.గీ. ఆత్మలాభమ్ము విడిచి యంత్యదశ వఱకు
భరతవర్షమ్మునకె పాటు పడియె నెవఁడు
అట్టి గోఖలె నతుల దేశాభిమానిఁ
గనిన మృత్యువ! మ్రింగితే కరుణ లేక ?

సీ. పాపతత్పరులై ప్రపంచదూషితులైన నరులెవ్వరును నీకు దొరకరైరొ?
పరహితంబును వీడ స్వీయహితంబును గడింపఁగడఁగు నవంచకులెందుఁ గానఁ
(బడరొ?
తమ దేశమునకు సుంతయుఁ బాటుపడని కుత్సితులెవ్వరు చిక్కరైరొ?
'పరమాత్మ నమ్ము నెత్తితిఁ బిల్చికొన'దంచు పరితపించు ముసల్లు పుడమిఁ
(గుపడిరొ?

తే.గీ. కటకటా! కంటఁబడవె లోకప్రపూజ్యుఁ
డతుల నిర్వ్యాజభక్తి భారతహితుండు
కడిఁది విమలుఁడు గోఖలే నడివయసునఁ
పాపి! మృత్యువ! నీదగు వాతఁబడఁగ.

సీ. ఎవరికున్నతిఁ గూర్చెఁ దన ప్రతిభమెయి యా భారతీయుల నెట్టు పాసినాఁడొ!
ఎది తనకుం దైవపదమెయి యా న్యాయనిర్మాణంపు సభ నెట్టు మఱచినాఁడొ!
ధ్యాతమెయ్యది తనకా హిందుదేశ సేవక సంఘమెట్టులు వదలినాఁడొ!
ఎది తన కామ్నాయ సదృశంబొ యా రాజధర్మపథమెట్లు దక్కినాఁడొ!

తే.గీ. హిందుదేశంబు విడి దివి కేగునపుడు
ఎట్లు తహతహపడినాఁడొ! హృదయమందు
ఇంక నెంతెంత లోనరుప నెంచినాఁడొ!
కలుష విరహితభక్తి గోఖలె సుకీర్తి!

మ. మును వాల్మీకిపరాశరాదిమునులన్ మోహాత్ములన్ గాఁగఁ జే
సినవాఁ డెల్ల చరాచరాత్మక జగత్సృష్టిస్థితి ధ్వంసకా

కలుఁడే యీతఁడు రాజకీయమున మార్తాండున్ భువన్ గోఖలేన్
బుధరాట్ప్రవృత్తినివృత్తిశాశ్వతపదంబున్ జేర్చెఁ గాక సత్కృపన్

(వై. హనుమంతరావుగారు)

సీ. ఏధీరుసుకృతులు, హిందూరమాదేవి కింపారఁ గ్రొవ్వెన్నె, లిచ్చుచుండె
నేపుణ్యుసమభావ, మీభారతీయుల జాతిమత్సరములఁ, జదుపుచుండె
నేశూరుచేతలం, బీరాష్ట్రజనములఁ గాపాడ ఖడ్గమై క్రాలుచుండె
నేపూరుషోత్తము, సెనలేనిభావికజ్ఞానమతులఁబోలెఁ, గాచుచుండె

గీ. నెవని సత్కీర్తిచంద్రిక లెల్లయవని
గ్రాలఁజేసెనో యట్టి గోపాలకృష్ణ
చంద్రు డస్తంగతుఁడుకాగ, సకలసుజన
చాతకావళి పొగిలెడి, సకరుణముగ !

ఉ. భారతఖండమర్గ్యవాపు,భద్రకవాటముఁబోలియుంటివో !
ధీరవిచార ! దుష్టుల, దీనులఁజేసి తొలంగిపోదువం
చారయలేకపోయితిమి, యక్కట! యెంతటి కష్టసాధ్య మీ
భారతినిన్నుబోలునొకభ్రాతను మాకిడు,భాగ్యమబ్బుటల్.

సీ. విద్యాగరిష్ఠులై, తెలిసినంతనెయేమి యయ్య ! నీసచ్చరిత, నందవలదె?
రాజగౌరవమంది, రాజిల్లఁగనెయేమి నీపరార్థవ్యాప్తి నెగడవలదె ?
దేశాభిమానులై, తేజరిల్లినదేమి నీయాత్మసంపద, నిలుపవలదె ?
వాగ్వైభవముగల్గి వదరినంతనె యేమి నీపట్టుదలఁ బూని చూపవలదె?

గీ. నీదునియమంబు నిష్కళంకనీతిపథము
భ్రాతృవర్గానుభావముల్ వదలి నీదు
ధైర్యసాహససంపత్తి తనరకున్న
నిష్ఫలంబగుఁగాదె? శ్రీనిగమచరిత !

సంపూర్ణము

PRINTED AT THE ANDHRAPATRIKA PRESS, MADRAS.